ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
శనివారం 5 అక్టోబరు 2024



కూర్మావతారంలో భక్తులకు దర్శనమిస్తున్న కదిరి లక్ష్మీనరసింహ స్వామి

కూర్మావతారంలో శ్రీవారు

కదిరిలోని శ్రీఖాద్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీవారు కూర్మావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నిత్య కైంకర్యాలు, అలంకరణ అనంతరం మత్స్యావతారంలో ఉన్న స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. - కదిరి

గాయత్రీదేవిగా దుర్గమ్మ



లేపాక్షిలో దుర్గాదేవికి గాయత్రీదేవి అలంకరణ



ఎనుమలపల్లి దుర్గాదేవికి అలంకరణ

లేపాక్షి, అక్టోబరు 4: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల రెండోరోజు శుక్రవారం లేపాక్షి ఆలయంలో దుర్గాదేవి.. గాయత్రీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. దుర్గా వీరభద్రస్వాములను అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, అర్చనలు, విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు బారులుతీరారు. పుట్టపర్తి మండలంలోని ఎనుమలపల్లి దుర్గాదేవి ఆలయంలో అమ్మవారు గాయత్రీమాతగా దర్శనమిచ్చారు. ఆలయంలో విదేశీయులు లోకక్షేమాన్ని కాంక్షిస్తూ చండీ హోమాన్ని ప్రారంభించారు.

వంకపాలు..!



వంకలో పడేసిన పాల ప్యాకెట్లు

అంగన్‌వాడీలకు సరఫరా అయిన పాలప్యాకెట్లను పడేశారు. ముదిగుబ్బలోని పాతవూరి వంకలో పాల ప్యాకెట్లు మట్టిపాలయ్యాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు పంపిణీ చేయాల్సిన దాదాపు వంద పాల ప్యాకెట్లను గుర్తుతెలియని వ్యక్తులు పడేశారు. కాలం చెల్లి పడేశారా, ఇతర కారణం ఏమైనా ఉందా అన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. దీనిపై సంబంధిత అధికారులు విచారణ చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు. ఈ విషయంపై బత్తలపల్లి సీడీపీఓ సరస్వతిని అడగ్గా.. పాలప్యాకెట్లను రోడ్డుపక్కన పడేసినట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. దీనిపై విచారించి, శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

-ముదిగుబ్బ

జిల్లాను అగ్రభాగాన నిలుపుదాం

వనరులను సద్వినియోగం చేసుకుందాం..: మంత్రి సవిత
అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనపై జిల్లాస్థాయి సమావేశం

పుట్టపర్తి, అక్టోబరు4(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే జిల్లాను అగ్రభాగాన నిలుపుదామని బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత పిలుపునిచ్చారు. శుక్రవారం స్వర్ణాంధ్ర-2047 జిల్లా విజన్ ప్రణాళిక జిల్లాస్థాయి సమావేశం పుట్టపర్తిలోని సాయిఆరామ్‌లో నిర్వహించారు. మంత్రితోపాటు జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్, కదిరి, పుట్టపర్తి ఎమ్మెల్యేలు కందికుంట వెంకటప్రసాద్, పల్లె సింధూరారెడ్డి, ఆయాశాఖల జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. సమావేశంలో మంత్రి సవిత మట్లాడుతూ.. రానున్న ఐదేళ్ల రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి, దేశంలోనే అగ్రగామిగా నిలపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. ఆ దిశగా జిల్లాల వారీగా కార్యాచరణ ప్రణాళిక అందించాలని ఆదేశించారన్నారు. సీఎం ఆలోచనలకు అనుగుణంగా ప్రజాప్రతినిధులు, అధికారులు పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని శాఖల అధికారులు.. నియోజకవర్గాల వారీగా ఎంపీలు, శాసనసభ్యులతో సమావేశాలు నిర్వహించి, ఎలాంటి అభివృద్ధి పనులు చేపట్టాలో ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. జిల్లా వెనుకబడిన ప్రాంతమైనా.. వ్యవసాయం, పారిశ్రామిక, ఉద్యానవన విభాగాల్లో మొదటి స్థానంలో ఉందన్నారు. జిల్లాలో వనరులున్నాయనీ, వాటిని సద్వినియోగం చేసుకుంటే అభివృద్ధి బాట పట్టించొచ్చన్నారు. జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ మాట్లాడుతూ.. కీలకరంగాలపై దృష్టి సారించి, అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలన్నారు. వ్యవసాయం, ఉద్యానవన, పారిశ్రామికవాడల అభివృద్ధి, పర్యాటకం తదితర అంశాలపై దృష్టి సారించాలన్నారు. జిల్లాను ప్రగతి పథంలో నడిపించేందుకు ప్రతిఒక్కరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. విజన్ ప్రణాళికలో ప్రజలు విద్యార్థులు, యువత భాగస్వాములు కావాలన్నారు.





జిల్లా విజన్ ప్రణాళిక సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సవిత, హాజరైన జిల్లా అధికారులు

జీవన ప్రమాణాలు పెంచుదాం: కందికుంట వెంకటప్రసాద్, కదిరి ఎమ్మెల్యే



కదిరి నియోజకవర్గాన్ని రానున్న ఐదేళ్లలో అన్నిరంగాల్లో అభివృద్ధి చేసే దిశగా ప్రణాళికలు రూపొందిస్తాం. టెంపుల్ టూరిజం, పారిశ్రామికం, వ్యవసాయం, ఉద్యానవనంతోపాటు పల్లెపట్నంలో ప్రజల అవసరాలు, ఆర్థికాభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు రూపొందించాల్సి ఉంది. ఆరునెలలకోసారి ఆయాశాఖల జిల్లా అధికారులు సమీక్ష నిర్వహించి, ప్రగతి కార్యచరణపై చర్చించి ప్రజలకు సేవ చేద్దాం.

పారిశ్రామిక హబ్‌గా తీర్చిదిద్దాలి: పల్లె సింధూరారెడ్డి, పుట్టపర్తి ఎమ్మెల్యే



పుట్టపర్తి నియోజకవర్గంలో పారిశ్రామిక, వ్యవసాయం, ఉద్యానవన, తాగు, సాగునీరు, ఉపాధి కల్పన వంటి అంశాలపై ప్రణాళికలు రూపొందించాలి. కప్పలబండ ఇండస్ట్రియల్ పార్కులో ఔత్సాహికులకు అవగాహన కల్పించి, పరిశ్రమల ఏర్పాటు చేయించి, ఐటీ హబ్‌గా అభివృద్ధి చేయాలి. సత్యసాయి విమానాశ్రయాన్ని ప్రజారవాణాతో కన్టెవిటీలోకి తీసుకురావడం, అటవీ అభివృద్ధి, హంద్రీనీవా కాలువ ద్వారా 193 చెరువులకు నీరివ్వడం, తాగు, సాగునీరు, రోడ్ల అనుసంధానం, సోలార్, టమోటా యూనిట్, గార్మెంట్స్ పరిశ్రమలు ఏర్పాటు చేసే దిశగా ప్రణాళికలు రూపొందించాలి.

వైసీపీలో క్యాంపు రాజకీయం!

కర్ణాటకలో సమావేశమైన పురం కౌన్సిలర్లు .. రూ.కోటి ఇస్తే చైర్మన్ చేస్తామన్న నాయకులు

హిందూపురం, అక్టోబరు 4: వైసీపీ ఘోరంగా ఓడిపోయినా పురంలో ఆ పార్టీ నాయకులు ఇంకా భ్రమల్లోనే ఉంటున్నారు. ప్రస్తుతం కూటమి అధికారంలో ఉంది, ఆ పార్టీకి మున్సిపల్ చైర్మన్ అయ్యేందుకు తగినంత సంఖ్యా బలం కూడా ఉంది. అయినా వైసీపీ నాయకులు, కౌన్సిలర్లు కొంతమంది తామే చైర్మన్ అవుతామని భ్రమ పడుతున్నారు. హిందూపురం మున్సిపాలిటీలో 38 మంది కౌన్సిలర్లు ఉండగా.. తెలుగుదేశం పార్టీకి 20 మందిదాకా బలం ఉంది. వైసీపీకి పరోక్షంగా 18 మంది ఉన్నా.. తెరపై కనిపిస్తున్నది 14 మందే. ఇలాంటి పరిస్థితుల్లో వైసీపీ చైర్మన్ కోసం ఆరాటపడటం ఆత్మాశే అవుతుంది. ఎన్నికల అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజతోపాటు 8 మంది కౌన్సిలర్లు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆ తర్వాత చైర్‌పర్సన్ రాజీనామా చేశారు. దీంతో చైర్మన్ ఎంపిక అనివార్యమైంది. ఈ పరిస్థితుల్లో టీడీపీ నుంచి 6వవార్డు కౌన్సిలర్ డీఈ రమేష్‌ను ఆపార్టీ చైర్మన్ అభ్యర్థిగా కూడా ఖరారు చేసింది. నూతన చైర్మన్‌ను ఎన్నుకోవాలని ఎన్నికల సంఘం, ఉన్నతాధికారులకు నివేదికలు కూడా పంపారు. సాంకేతికపరంగా ఆలస్యం అవుతుండటంతో వైసీపీ కౌన్సిలర్లు చైర్మన్ కోసం క్యాంపు రాజకీయాలకు తెరలేపారు. గత వారం చైర్మన్ ఎంపిక అంటూ ఆ పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డిని కలవడానికి తాడేపల్లికి వెళ్లారు. తాజాగా శుక్రవారం 14 మంది కౌన్సిలర్లు కర్ణాటకలోని ఓ రిసార్ట్‌లో సమావేశమైనట్లు తెలిసింది. మొత్తం 14మంది పాల్గొనగా.. వారిలో ముగ్గురు కౌన్సిలర్లు చైర్మన్ సీటు కావాలని అడిగినట్లు తెలిసింది. ఇందులో మైనార్టీ వర్గానికి చెందిన కౌన్సిలర్ చైర్మన్ పదవి కావాలని అడగ్గా.. బీసీ వర్గానికి చెందిన కౌన్సిలర్లు తమకే కేటాయించాలంటూ పార్టీ నాయకులు వేణురెడ్డి, బాబురెడ్డి వద్ద కోరినట్లు తెలిసింది. దీంతో బీసీ వర్గానికి చెందిన కౌన్సిలర్ పేరు ప్రతిపాదించినట్లు సమాచారం. ఆయన మొదట రూ.కోటి వైసీపీ నాయకుల చేతికి ఇస్తే చైర్మన్ ఎంపిక జరుగుతుందని సమాచారం. తెలుగుదేశం పార్టీ నుంచి ఆరుగురు సభ్యులు వైసీపీలోకి వస్తారని ఆ పార్టీ నాయకులు ప్రచారం చేస్తున్నారు. వీరికోసం రూ.80లక్షలదాకా ఖర్చు చేయాలనీ, ఈ నేపథ్యంలో మొదట రూ.కోటి తమ చేతికి ఇస్తే తరువాత చైర్మన్ స్థానం చెబుతామంటూ వైసీపీ ముఖ్య నాయకులు అన్నట్లు సమాచారం. ఆ పార్టీకి చెందిన నలుగురైదుగురు సభ్యులే.. మీటింగ్‌కు గైర్హాజరవడం గమనార్హం. అలాంటప్పుడు తెలుగుదేశం పార్టీ నుంచి కౌన్సిలర్లు వస్తారని చెప్పడం విడ్డూరంగా ఉందన్న వాదనలు వినిపిస్తున్నాయి. సంకేతాలు లేకపోయినా.. చైర్మన్ పేరు చెప్పి క్యాంపు రాజకీయాలు నిర్వహించడం ఆ పార్టీకే చెల్లుతుందని కూటమి నాయకులు అంటున్నారు.

ఆగిన బతుకు చక్రం



మూలనపడి డిస్కులతో దర్శనమిస్తున్న లారీ

పురంలో లారీ యజమానుల బతుకు దుర్భరం

- లోడింగ్ లేక ఇక్కట్లు
- మూలనపడిన లారీలు
- రోడ్డునపడిన యజమానులు

హిందూపురం అర్బన్, అక్టోబరు 4: బతుకు చక్రం ఆగిపోయింది. పట్టణంలో ఒక వెలుగువెలిగిన లారీల యజమానులు నేడు దుర్భర పరిస్థితులను అనుభవిస్తున్నారు. వారి లారీలకు స్థానికంగా బాడుగలు దొరక్కపోవడంతో ఉపాధి కోల్పోయారు. లారీలను నిర్వహించలేక మూలనపడేశారు. ఇలా వందల సంఖ్యలో లారీలు మూలనపడ్డాయి. పలు వాహనాలను గుజిరీకి తరలించారు కూడా. ఒకప్పుడు రెండు, మూడు లారీలు పెట్టుకుని, బాగా బతికిన యజమానులు కూడా ప్రస్తుతం జీవనోపాధి కోల్పోయారు. కుటుంబాలతో రోడ్డున పడ్డారు. కొంతమంది కూలి పనులకు వెళ్తున్నారు. మరికొంతమంది సొంత ఊరిలో కూలి పనులు చేయలేక రాత్రికిరాత్రి ఊరు వదిలేసి, వెళ్లిపోతున్నారు.



లోడింగ్ లేక నిలబడిపోయిన లారీలు

సీన్ రివర్స్

ఈ ప్రాంత ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో మండలంలోని తూమకుంట, గోళ్ళాపురం ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేశారు. దీంతో ఈ ప్రాంత ప్రజలు సంబరపడిపోయారు. వేలాదిమంది లారీలు కొనుగోలు చేశారు. ఫైనాన్స్, బ్యాంకు రుణాలతో వాటిని కొనుగోలు చేశారు. పారిశ్రామిక వాడల్లో ఫ్యాక్టరీలకు సరుకు రవాణాకు వాటిని ఉంచారు. తొలిరోజుల్లో లారీలకు పూర్తిగా పని ఉండేది. దీంతో లారీలు విపరీతంగా కొనుగోలు చేశారు. యజమానులతోపాటు డ్రైవర్లు, క్లీనర్లు ఉపాధి పొందారు. పదేళ్ల క్రితం వరకు అలానే సాగింది. ఆ తరువాత సీన్ రివర్స్ అయిపోయింది. బయటి వ్యక్తుల రాకతో స్థానిక లారీ యజమానులకు ఇబ్బందులు తలెత్తాయి. స్థానికుల లారీలకు పరిశ్రమల్లో లోడింగ్ చేయకుండా అడ్డుకున్నారు. ఇతర ప్రాంతాల వాహనాలకు లోడింగ్ చేస్తూ వచ్చారు. స్థానిక లారీలకు లోడింగ్ లేకుండాపోయింది. దీంతో తీసుకున్న అప్పులు కట్టలేక కొంతమంది లారీలను అమ్ముకున్నారు. పన్నులు చెల్లించలేకపోయారు. మరికొంత మంది ఫైనాన్స్, బ్యాంకులకు లారీలను వదిలేశారు. కుటుంబం గడవడం కష్టంగా మారింది. భార్య మెడలోని పుస్తెలు, బంగారు నగలను సైతం పలువురు తాకట్టు పెట్టాల్సి వచ్చింది. ఇల్లు గడవాలంటే పిల్లాపాపలతో పాటు అందరూ శ్రమించక తప్పలేదు. పిల్లలను పనికి పంపాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇంకొంతమంది ఇంత బతుకు బతికి కూలీలుగా కనపడటం ఇష్టంలేక ఏకంగా రాత్రికి రాత్రే కటుంబ సభ్యులతో కలిసి ఊర్లు వదిలి వెళ్లిపోయారు. లోడింగ్ ఆపేయడంతో లారీలు మూలనపడ్డాయి. టైర్లు ఎండిపోయి, డిస్కులు మాత్రం మిగిలాయి. మూలనపడిన లారీల్లో పిచ్చిమొక్కలు మొలచి, తీగలు అల్లుకుపోయాయి. స్థానిక లారీలకు లోడింగ్ అవకాశం కల్పించి, ఆదుకోవాలని యజమానులు కోరుతున్నారు.





తడిసిపోయిన వేరుశనగను చూపుతున్న రైతు చంద్రమోహన్‌రెడ్డి

తడిసిన రైతు కష్టం

అప్పోసప్పో చేసి పెట్టుబడులు పెట్టి పండించిన పంట తొలగించాక వర్షానికి తడిసి ముద్దయింది. రెండురోజులుగా కురుస్తున్న వర్షానికి పూర్తిగా తడిసి ముద్దయి, కాయలతోపాటు కట్టె కూడా కూడా నల్లగామారి రైతుకు తీవ్ర నష్టం మిగిల్చింది. మండలంలోని గరుడంపల్లికి చెందిన రైతు చంద్రమోహన్ రెడ్డి బోరుబావి కింద పదెకరాల్లో వేరుశనగ సాగుచేశాడు. రూ2 లక్షల వరకు పెట్టుబడి పెట్టాడు. పంటకాలం పూర్తవడంతో రెండ్రోజుల క్రితం తొలగించాడు. ఆ రాత్రి నుంచే వర్షం కురవడంతో పంటంతా తోటలోనే తడిసి ముద్దయి కుళ్లిపోయింది. పంట పండినా వర్షానికి తడిసి చేతికందకుండా పోయిందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. - ధర్మవరంరూరల్

అయ్యో.. చిన్నా..

అమ్మను చూడాలంటూ మారాం.. ఆటోలో వెళ్తూ చిన్నారి మృతి



చిన్నా (ఫైల్)

హిందూపురం, అక్టోబరు 4: అమ్మను చూడాలంటూ ఐదేళ్ల చిన్నారి అడిగాడు. మారాం చేశాడు. దీంతో అమ్మను చూపించేందుకు తీసుకెళ్తుండగా.. రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. హిందూపురం పరిధిలోని కొట్నూరు వద్ద హైవే నుంచి సర్వీస్ రోడ్డుకు తిరిగే చోట శుక్రవారం ఆటో బోల్తాపడి బాలుడు చిన్నా (5) మృతి చెందాడు. పరిగి మండలం కోనాపురం గ్రామానికి చెందిన సురేష్ భార్య నాగమణి హిందూపురం మండలం జీవ్మాకులపల్లిలో కోళ్లఫారంలో పనిచేస్తోంది. సురేష్.. కుమారుడు చిన్నాతో కలిసి స్వగ్రామంలోనే ఉండేవాడు. అమ్మను చూడాలని చిన్నా మారాం చేశాడు. దీంతో తండ్రి సురేష్ శుక్రవారం సొంత ఆటోలో కుమారుడిని అమ్మ వద్దకు తీసుకెళ్లేందుకు బయల్దేరాడు. కొట్నూరు వద్ద ఉన్న హైవేపైనుంచి సర్వీస్ రోడ్డుకు తిరిగే సమయంలో కుక్క అడ్డం రావడంతో సడన్ బ్రేక్ వేశా డు. దీంతో ఆటోలో ఉన్న చిన్నా కిందపడ్డాడు. చిన్నారిని వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందిస్తుండగా మృతిచెందినట్లు వైద్యులు తెలిపారన్నారు. ప్రమాదంపై కేసు నమోదుచేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

టమోటా ధరకు రెక్కలు

● దిగుబడులు తగ్గడమే కారణం



అనంతపురంరూరల్, అక్టోబరు 4: కక్కలపల్లి మార్కెట్‌లో టమోటా ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. పదిరోజులుగా టమోటా ధరలు భారీగా పెరుగుతున్నాయి. కిలో రూ.50పైగానే మార్కెట్‌లో అమ్ముడుపోతున్నాయి. దిగుబడులు తగ్గిపోవడమే ఇందుకు ప్రధానంగా తెలుస్తోంది. పది రోజుల కిందట వరకు రెండు వేల టన్నులకు పైగా టమోటాలు మార్కెట్‌కు వచ్చేవి. ఈక్రమంలో ధరలు కూడా ఓ మోస్తరుగా ఉండేవి. అయితే వారంరోజుల్లోనే టమోటా ధరల్లో భారీ మార్పు చోటు చేసుకుంది. దిగుబడి బాగా తగ్గిపోవడంతో కాయలు మార్కెట్‌కు రావడం తగ్గింది. రెండు వేల టన్నుల్లోపే మార్కెట్‌కు వస్తున్నాయి. నాలుగైదు రోజుల నుంచి వెయ్యి టన్నులలోపే కాయలు వస్తున్నాయి. ఈక్రమంలో టమోటా ధరకు రెక్కలొచ్చిపడ్డాయి. మేలి రకం కిలో రూ.50 నుంచి రూ.75 మధ్య పలుకుతున్నాయి. సరాసరి ధరలు కూడా రూ.40నుంచి రూ.60మధ్య ఉంటున్నాయి. కనిష్ఠ ధరలు కిలో రూ.30తో అమ్ముడుపోతున్నాయి. శుక్రవారం ధరల్లో కాస్త వ్యత్యాసం కనిపించింది. దిగుబడులు పెరగడంతో ధర కొంత వరకు తగ్గింది. దీనికితోడు వర్షాలు కురుస్తుండం కూడా ధరలపై ప్రభావం చూపే అవకాశం ఉంది.

గత వారం రోజుల్లో పలికిన ధరలు ఇలా..

తేదీ	టన్నులు (కిలో రూ)	గరిష్ఠం (కిలో రూ)	సరాసరి (కిలో రూ)	కనిష్ఠం (కిలో రూ)
సెప్టెంబరు28న	1350	46	36	30
29న	1350	47	38	30
30న	900	48	38	30
అక్టోబరు1	900	60	45	30
2న	675	74	65	50
3న	630	77	67	51
4న	975	63	54	42

ఏం లాభం..!

పంటను ఆశించిన మచ్చ తెగులు
దెబ్బతిన్న మొక్కలు
టమోటా రైతు
ఆశలపై నీళ్లు



మచ్చ తెగులు సోకిన టమోటా పంట

ఆశాజనకంగా ధరలు.. పడిపోయిన పంట దిగుబడి

చిలమత్తూరు, అక్టోబరు 4: మార్కెట్‌లో టమోటా ధరలు బాగున్నా పంట లేకపోవడంతో రైతులకు నిరాశ తప్పడం లేదు. టమోటా పంటకు తెగుళ్లు సోకి రైతులు నష్టపోతున్నారు. మండలంలో 200 ఎకరాల్లో టమోటా సాగు చేశారు. ఇటీవల బోరుబావుల ఆధారంగా రైతులు ఎక్కువగా టమోటానే సాగు చేస్తున్నారు. మండలానికి దగ్గరగా బాగేపల్లిలో టమోటా మార్కెట్ ఉండటం పంట సాగు పెరగడానికి కారణమని చెప్పవచ్చు. ఈ ప్రాంత వాతావరణం కూడా టమోటా పంటకు అనుకూలంగా ఉంది. అయితే సెప్టెంబరు ప్రారంభంలో కురిసిన వర్షం టమోటా రైతుల ఆశలపై నీళ్లు చల్లింది. ఆ వర్షానికి వాతావరణంలో మార్పులు వచ్చి పంటకు ఆకుమచ్చ తెగుళ్లు సోకాయి. దీంతో ఆశాజనకంగా ఉన్న పంటలు పూర్తిగా కుదేలయ్యాయి. మొక్కలోని ఆకులు, కొమ్మలు, కాండంపై నల్లమచ్చలు ఏర్పడ్డాయి. వెరసి మొక్కలోని కాయలపై నల్లమచ్చలు ఏర్పడ్డాయి. పిందెలు, పూత పూర్తిగా రాలిపోయింది.

ఎకరానికి రూ.లక్ష పెట్టుబడి

ఎకరంలో పంట సాగుచేసిన రైతులు రూ.లక్ష వరకు ఖర్చు చేసుకున్నారు. పంట చేతికొచ్చే సమయంలో మచ్చ తెగులు సోకడంతో తీవ్రంగా నష్టపోయారు. పంటలో కోయడానికి నాణ్యమైన కాయలు కనిపించట్లేదు. ఉన్న కాయలన్నీ మచ్చలతో నిండిపోయాయి. ఈ తరుణంలో పంటకు పెట్టిన పెట్టుబడి కూడా దక్కలేదని రైతులు వాపోతున్నారు. మచ్చ తెగులు సోకడంతో పంటను కాపాడుకోవడానికి అదనంగా మందులు పిచికారీ చేయాల్సి వచ్చిందనీ, అయినా తెగులు తగ్గలేదన్నారు.

ధరలున్నా దిగుబడుల్లేవు

ప్రస్తుతం మార్కెట్‌లో టమోటా మంచి ధర పలుకుతోంది. బాగేపల్లి టమోటా మార్కెట్లో 14 కిలోల బాక్సు గరిష్ఠంగా రూ.1100 వరకు పలుకుతోంది. ఆకుమచ్చ తెగులు కారణంగా పంటలు దెబ్బతిని, దిగుబడి తగ్గిపోయింది. ఎకరం విస్తీర్ణంలో ఒక కోతకు 150 బాక్సుల వరకు వచ్చేవి. ఇప్పుడు 20 నుంచి 30 బాక్సులు మాత్రమే వస్తున్నాయని రైతులు పేర్కొంటున్నారు. అందులో కాయలు మచ్చలు కలిగి ఉండటంతో వాటికి ధర కూడా దక్కట్లేదు. మచ్చ కలిగిన కాయలను మార్కెట్లో కొనుగోలు చేయడం లేదు. వాటిని నిల్వ ఉంచుకోలేమనీ, దాంతో వాటిని ఎగుమతి చేయడానికి పనికి రావని కొనుగోలుదారులు అంటున్నారు.

పత్తాలేని ఉద్యాన శాఖాధికారులు

ఉద్యాన పంటలపై రైతులు ఆసక్తి పెంచుకుంటున్న తరుణంలో సలహాలు, సూచనలు ఇవ్వాల్సిన ఆ శాఖ అధికారులు పత్తాలేకుండా పోయారు. కనీసం ఏ పంటలు ఎప్పుడు వేసుకోవాలి, రోగాల బారిన పడకుండా ఎలా కాపాడుకోవాలి అనే విషయాలను తెలియజేసేవారే లేరు. వ్యవసాయాధికారులు ఉన్నా వేరుశనగ, మొక్కజొన్న, వరి వంటి పంటలకు మాత్రమే సలహాలు ఇస్తున్నారు. మండలంలో వీరాపురం, దేమకేతేపల్లి, టేకులోడు, కోడికొండ, సోమఘట్ట, చాగలేరు, కోడూరు పంచాయతీల్లో ఇటీవల టమోటా, క్యారెట్, బీట్‌రూట్, బీర, బీన్స్, మిరప వంటి పంటల సాగు పెంచుకుంటున్నారు. వాటిపై అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. దీంతో పంటలకు సోకే రోగాలను నియంత్రించుకోవడానికి పురుగుమందల దుకాణదారులపై ఆధారపడుతున్నారు. వారిచ్చే మందులతో పెట్టుబడులు పెరుగుతున్నాయే తప్ప.. తెగులు నియంత్రణలోకి రావట్లేదు.

అధికారులు సలహాలు ఇస్తే బాగుంటుంది

ఇతర పంటల కంటే టమోటా, క్యారెట్, బీట్‌రూట్ పంటలను ఇటీవల సాగుచేసుకుంటున్నాం. పంటలకు రోగాలు అధికంగానే సోకుతున్నాయి. వాటి నివారణకు ఏ మందులు వాడాలో అంతగా తెలీదు. ఈ పరిస్థితుల్లో అధికారులు వచ్చి పంటలను పరిశీలించి ఏ మందులు వాడాలో చెబితే బాగుంటుంది. అలా జరగడం లేదు. దీంతో పంటలు సాగు చేసి తీవ్రంగా నష్టపోతున్నాం



-రామిరెడ్డి, కొట్లోపల్లి



మచ్చ తెగులు సోకిన టమోటాలు



మచ్చ తెగులు సోకిన టమోటా మొక్క ఆకులు

మచ్చ తెగులుతో నష్టపోయా..

ఎకరంలో టమోటా సాగుచేశా. పంటకు ఆకు మచ్చ తెగులు సోకింది. కాయలు పూర్తిగా మచ్చతో నిండిపోయాయి. పిందెలు, పూత రాలిపోయింది. ఇప్పటి వరకు పంట సాగుకు రూ.లక్ష వరకు ఖర్చు చేశా. మార్కెట్లో ధరలున్నా పంట దెబ్బతిని, నష్టపోయా.



- భాస్కర్, మరవకొత్తపల్లి, చిలమత్తూరు మండలం

అనంతలో సీఎంఆర్

షాపింగ్‌మాల్ ప్రారంభం... సందడి చేసిన సినీతారలు



షాపింగ్‌మాల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, శ్రీరామ్ తదితరులు

అనంతపురం కల్చరల్, అక్టోబరు 4: జిల్లా కేంద్రంలోని క్లాక్‌టవర్ సమీపంలో సీఎంఆర్ షాపింగ్‌మాల్ 36వ బ్రాంచి ప్రారంభోత్సవాన్ని శుక్రవారం అట్టహాసంగా నిర్వహించారు. కార్యక్రమానికి అనంతపురం రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్, ఆయన భార్య పరిటాల జ్ఞానలతోపాటు సినీ తారలు పాయల్ రాజ్‌పుత్, నభానటేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రిబ్బన్ కట్‌చేసి షాపింగ్‌మాల్‌ను ప్రారంభించారు. అనంతరం వినాయకుడి ఎదుట జ్యోతి ప్రజ్వలన చేశారు. ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ జిల్లాలో తయారైన పట్టుచీరలను సీఎంఆర్ షాపింగ్‌మాల్ నిర్వాహకులు తీసుకుని విక్రయించి, తయారీదారులకు ఉపాధి కల్పించాలన్నారు. స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. సినీనటులు పాయల్ రాజ్‌పుత్, నభానటేష్‌లు మాట్లాడుతూ మధ్యతరగతి ప్రజలకు సైతం అందుబాటు ధరల్లో ఉండేలా సీఎంఆర్ షాపింగ్‌మాల్‌ను అనంతలో నెలకొల్పడం శుభపరిణామం అన్నారు. సీఎంఆర్ షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవానికి సినీతారలు వస్తున్నారన్న సమాచారంతో అభిమానులు, యువత పెద్దసంఖ్యలో క్లాక్ టవర్ వద్ద గుమిగూడారు. కార్యక్రమంలో సీఎంఆర్ షాపింగ్‌మాల్ యాజమాన్యం, సిబ్బంది పాల్గొన్నారు.



షాపింగ్‌మాల్‌లో చీరలు చూపుతున్న సినీ తారలు పాయల్ రాజ్‌పుత్, నభానటేష్

నేటి నుంచి ఆంధ్ర- త్రిపుర జట్ల ప్రాక్టీస్ మ్యాచ్

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 4: ఆంధ్ర-త్రిపుర జట్ల మధ్య రంజీ ప్రాక్టీస్ మ్యాచ్ శని, ఆదివారాలు స్థానిక అనంతపురం క్రికెట్ గ్రౌండ్-బిలో నిర్వహించనున్నారు. గత వారం రోజుల నుంచి స్థానిక ఆర్డీటీ స్టేడియంలో ఆంధ్ర జట్టు ఆటగాళ్లు శిక్షణా శిబిరంలో సాధన చేస్తున్నారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్, ఫిట్‌నెస్, కీపింగ్ విభాగాల్లో నెట్ ప్రాక్టీస్ చేశారు. శుక్రవారం సాయంత్రం త్రిపుర జట్టు ఆటగాళ్లు ఏసీజీకి చేరుకున్నారు. 2024-25 సీజన్‌కు సంబంధించి ఆంధ్ర జట్టు ఈనెల 11 నుంచి నాగ్‌పూర్‌లో విదర్భతో జరిగే రంజీ మ్యాచ్ ఆడనుంది. ఇందులో కేఎస్ భరత్, హనుమ విహారి, అశ్విన్ హెబ్బార్, శశికాంత్, స్టీఫెన్‌లు ప్రధాన ఆటగాళ్లు ఉన్నారు. త్రిపురతో జరిగే ఆంధ్రా రంజీ ప్రాక్టీస్ మ్యాచ్‌కు సంబంధించి ఏర్పాట్లు పూర్తి చేశారు.

రైల్వే సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

● ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

అనంతపురం,అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో రైల్వే సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆ శాఖ ఉన్నతాధికారులను ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ కోరారు. విజయవాడలోని ఎలక్ట్రికల్ ట్రాక్షన్ ట్రైనీ సెంటర్లో శుక్రవారం సౌత్ సెంట్రల్ ఆధ్వర్యంలో నిర్వహించిన పార్లమెంటు సభ్యుల సమావేశానికి ఎంపీ హాజరయ్యారు. జిల్లాలో రైల్వే సమస్యలపై ఆయన ప్రస్తావించడంతో పాటు సమస్యలను త్వరతగతిన పరిష్కరించాలని దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. గుంతకల్లు రైల్వే డివిజన్‌లో అనేక సమస్యలున్నట్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గత వైసీపీ ప్రభుత్వం రైల్వేను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ప్యాసింజర్ రైళ్లను నడపాలన్నారు. ఇప్పటికే ఉన్న ప్యాసింజర్ రైళ్లకు అదనంగా మూడు, నాలుగు బోగీలను అనుసంధానం చేయాలని కోరారు. ప్రస్తుతం మచిలీపట్నం నుంచి అనంతపురం మీదుగా బెంగళూరుకు నడుస్తున్న కొండవీడు ఎక్స్‌ప్రెస్‌ను ప్రతి రోజూ నడిపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. బెంగళూరు నుంచి పుట్టపర్తి వరకూ ఉన్న ప్యాసింజర్‌ను అనంతపురం వరకూ నడపాలన్నారు. బెంగళూరు నుంచి ఢిల్లీకి నడుపుతున్న రాజధాని ఎక్స్‌ప్రెస్‌ను అనంతపురంలో నిలిపే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. బెంగళూరు నుంచి కాచిగూడాకు వెళ్తున్న వందే భారత్‌ను హిందూపురంలో నిలపాలన్నారు. గుంతకల్లు డివిజన్‌లో అండర్ ప్రాసెస్ త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రయాణికులు వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేరే విధంగా భద్రతా చర్యలు తీసుకోవాలన్నారు. రైల్వేకు సంబంధించి అనేక నిర్మాణాలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటి పూర్తికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.



సౌత్ సెంట్రల్ రైల్వే ఉన్నతాధికారులతో మాట్లాడుతున్న ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ

ఐదేళ్ల కిందటి ఫిర్యాదుపై విచారణ

● ఆలస్యంపై ఫిర్యాదుదారుడి అసహనం

గుంతకల్లు, అక్టోబరు 4: ఐదేళ్ల కిందట గుంతకల్లు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో అప్పటి సూపరింటెండెంటుపై వచ్చిన ఫిర్యాదులపై వైద్యాధికారులు ఇప్పుడు విచారణ చేపట్టారు. గతంలో సూపరింటెండెంటుగా పనిచేసిన కమలమ్మపై సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ సంఘ డివిజనల్ కార్యదర్శి బీ సురేశ్ పలు ఆరోపణలు చేశారు. సూపరింటెండెంటుగా పనిచేస్తూ ఆసుపత్రి సిబ్బంది సాయంతో తన సొంత ఆసుపత్రికి రోగులను తరలిస్తున్నారని, ఆసుపత్రిలో ఆపరేషన్లు చేసే అవకాశం ఉన్నా అనంతపురం ఆసుపత్రికి రెఫర్ చేస్తున్నారని, ఆసుపత్రికి వచ్చిన రూ. 70 లక్షల నిధుల్లో అక్రమాలకు పాల్పడ్డారంటూ 2019 నవంబరు నెలలో జిల్లా అధికారులు, అప్పటి ప్రభుత్వ కార్యదర్శి, ఏరియా ఆసుపత్రుల కమిషనరుకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదులపై అప్పటి వైసీపీ ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. అయితే పెండింగులో ఉన్న ఫిర్యాదుల విచారణ పేరుతో వైద్య శాఖ ప్రస్తుతం చర్యలు చేపట్టింది. ఈ మేరకు కడప డీసీహెచ్ఎస్ హిమదేవి, ఆమెతోపాటు అధికారులు విచారణ నిమిత్తం శుక్రవారం ఉదయం ఇక్కడకు వచ్చారు. ఆరోపణలను ఎదుర్కొంటున్న విశ్రాంత వైద్యురాలు కమలమ్మను ప్రభుత్వ ఆసుపత్రికి పిలిపించి వివరణ అడిగారు. అకౌంట్సు శాఖాధికారులను ప్రభుత్వ నిధుల విషయంగా విచారించారు. ఫిర్యాదుదారుడు సురేశ్‌ను పిలిపించి మాట్లాడారు. ఈ విషయంగా ఫిర్యాదుదారుడు మాట్లాడుతూ విచారణ ఇంత ఆలస్యంగా చేపడితే ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. అవినీతి జరిగి ఉంటే అందుకు తగినట్లు చర్యలు తప్పక ఉంటాయని విచారణాధికారి అన్నారు. విలేరులతో ఆమె మాట్లాడుతూ విచారణ నివేదికను ఉన్నతాధికారులకు పంపతామని తెలియజేశారు.



ఫిర్యాదుదారుడితో మాట్లాడుతున్న విచారణాధికారి హిమదేవి

26 నుంచి కళాశాలల క్రీడాపోటీలు

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 4: వర్సిటీ అనుబంధ కళాశాలల విద్యార్థులకు 26 నుంచి ఇంటర్ కాలేజియేట్ క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత పేర్కొన్నారు. వర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రెటరీ డాక్టర్ జెస్సీ ఆధ్వర్యంలో 2024-25 క్రీడాపోటీల నిర్వహణ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ నూతన విద్యావిధానం కరికులంలో స్పోర్ట్స్ సబ్జెక్టును ప్రత్యేకంగా చేర్చినట్లు వివరించారు. టైంటేబుల్ ప్రకారం ప్రతి తరగతికి కేటాయించిన పీరియడ్‌లో క్రీడలపై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. ఏడాదికొకసారి కళాశాలల మధ్య పోటీలను నిర్వహించి విద్యార్థులు ప్రోత్సహిస్తున్న ట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఈ ఏడాది పోటీలను ఆర్ట్స్ కళాశాలలో ఈనెల 26 నుంచి 28వరకు, డిసెంబరు 12, 13న, ఎస్ఎస్‌బీఎన్‌లో ఈనెల 17నుంచి 19వరకు, ఎస్వీ డిగ్రీ కళాశాలలో డిసెంబరు 2నుంచి 9వరకు, గుంతకల్లు ఎస్ఎస్‌జీఎస్ కళాశాలలో నవంబరు 3నుంచి 11వరకు పలురకాల క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో రెక్టార్ వెంకటనాయుడు, రిజిస్ట్రార్ రమేష్‌బాబు, సీడీసీ డీన్ కోటలో రామగోపాల్, ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర, జేఎన్‌టీయూ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రెటరీ జోజిరెడ్డి, వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

డీఎఫ్ఓ వినీత్‌కుమార్ బదిలీ

● ఆయన స్థానంలో విఘ్నేష్

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 4: జిల్లా అటవీశాఖాధికారి (డీఎఫ్ఓ) వినీత్‌కుమార్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో విఘ్నేష్‌ని నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వినీత్ కుమార్ కడప డీఎఫ్ఓగా బదిలీ అయ్యారు. మార్కాపురం ఎన్విరాన్‌మెంటల్ ఫారెస్ట్ సైన్స్ అండ్ టెక్నాలజీ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్‌గా ఉన్న విఘ్నేష్‌ను అనంతపురం డీఎఫ్ఓగా నియమించారు.

సీసీఎఫ్‌గా యశోదాబాయ్

అనంతపురం సర్కిల్ చీఫ్‌కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (సీసీఎఫ్)గా యశోదాబాయ్ నియమితులయ్యారు. ఇప్పటి వరకు తిరుపతి సర్కిల్ సీసీఎఫ్ నాగేశ్వరరావు ఇన్‌చార్జిగా ఉండేవారు. ఆయన వర్కింగ్ ప్లాన్ పీసీసీఎఫ్ హెడ్ ఆఫీస్‌కు బదిలీ కావడంతో రెగ్యులర్ సీసీఎఫ్‌గా మంగళగిరి ఆర్ అండ్‌డీ సీసీఎఫ్‌గా ఉన్న యశోదాబాయ్‌ను అనంతపురం సర్కిల్‌తో పాటు కర్నూలు ఇన్‌చార్జి సీసీఎఫ్‌గా బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

అహుడా వీసీగా బాధ్యతలు చేపట్టిన జేసీ

అనంతపురం క్రైం, అక్టోబరు 4: అహుడా వైస్ చైర్మన్‌గా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. జిల్లా జేసీగా ఉన్న ఆయనను అహుడా వైస్ చైర్మన్‌గా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు వెలువడిన విషయం తెలిసిందే. పీఓ ఇషాక్, ఇతర అధికారులతో సమావేశమై పలు అంశాలు చర్చించారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

హిందూపురం, అక్టోబరు 4: మండలంలోని కిరికెర వద్ద ఉన్న కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న నిఖిత్ (17) రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్ఐ బాలాజీనాయక్ తెలిపారు. ఆయన తెలిపిన మేరకు రొళ్లకు చెందిన చంద్రప్ప కుమారుడు నిఖిత్ స్థానిక ఎల్‌ఆర్‌జీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. గురువారం మధ్యాహ్నం దసరా సెలవులు వదిలారు. దీంతో విద్యార్థి రొళ్లకు వెళ్లకుండా కళాశాలకు సమీపంలో ఉన్న రైల్వేట్రాక్‌పై రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రాత్రి లోకోపైలెట్ ఇచ్చిన సమాచారంతో రైల్వే పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి ఆత్మహత్య చేసుకున్న విద్యార్థి వద్ద ఉన్న ఆధారాలతో అతడి తండ్రి చంద్రప్పకు సమాచారం ఇచ్చారు.

వారు అక్కడికి వచ్చి గుర్తించాక శవాన్ని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తండ్రి చంద్రప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు. మొదటి సంవత్సరం ఎంపీసీ గ్రూపులో కొన్ని సబ్జెక్ట్‌లో ఫెయిల్ అయ్యాడని రెండో సంవత్సరంలో కూడా చదువులో వెనుకబడి ఉన్నాడు. దీనిపైనే ఇంటికి వెళ్లినప్పుడు తల్లిదండ్రులతో చెప్పేవాడంటూ చదువులో వెనుకబడి ఉండటంతోనే ఆత్మహత్య చేసుకున్నాడని తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఓవరాల్ చాంపియన్ ఉరవకొండ జట్టు

ముగిసిన గ్రామీణస్థాయి బాలికల అథ్లెటిక్స్

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 4: ఆర్డీటీ-అనంత క్రీడా గ్రామం సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజులుగా స్థానిక ఆర్డీటీ స్టేడియంలో నిర్వహిస్తున్న కేంద్రస్థాయి గ్రామీణ బాలికల అథ్లెటిక్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఉమ్మడి ఏపీలో 38 ప్రాంతాల నుంచి 400మందికి పైగా క్రీడాకారిణులు పాల్గొన్నారు. ఓవరాల్ చాంపియన్‌గా ఉరవకొండ రీజియన్ బాలికల అథ్లెటిక్ జట్టు నిలిచింది. మడకశిర ద్వితీయ స్థానం, ఆదోని తృతీయ స్థానంలో నిలిచాయి. బాలికలకు 60మీటర్లు, 100 మీటర్లు, 200మీటర్ల పరుగు, లాంగ్‌జంప్, షాట్‌పుట్ ఫైనల్ పోటీలు శుక్రవారం నిర్వహించారు. ఇందులో అండర్-14 60మీటర్ల విభాగంలో గుడిబండ కేజీబీవీ విద్యార్థి సుప్రియ బంగారు పతకం సాధించింది. రిలే పరుగు పందెంలో మడకశిర విద్యార్థి బంగారు పతకం సాధించింది. లాంగ్ జంప్ ఆలూరు జడ్పీ హైస్కూల్ జ్యోతి, షాట్‌పుట్‌లో లేపాక్షి జడ్పీ హైస్కూల్‌కు చెందిన సారిక బంగారు పతకం సాధించారు. అండర్-16 విభాగం 100మీటర్లలో ఉరవకొండ జడ్పీ హైస్కూల్ అర్చన, 200మీటర్లలో ఉరవకొండ యశశ్విని, రిలే 400మీటర్లలో ఉరవకొండ రీజియన్, లాంగ్‌జంప్‌లో ఆత్మకూరు కేజీబీవీ ఐశ్వర్య, షాట్‌పుట్‌లో గుడిబండ జడ్పీ హైస్కూల్ షన్ముఖీ బంగారు పతకాలు సాధించారు. విభిన్నప్రతిభావంతుల విభాగంలో లాంగ్ జంప్‌లో ఆర్డీటీ స్కూల్ లాలి, 100మీటర్లలో ఆర్డీటీ స్కూల్ లాలి, ఇంటెలెక్చువల్ 100మీటర్లలో రాధిక, షాట్‌పుట్‌లో రమ్య విజేతలుగా నిలిచారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. పారా ఒలింపిక్స్‌లో కాంస్య విజేత దీప్తి జీవన్‌జీలను ఉత్తమ అవార్డులతో సత్కరించారు. కార్యక్రమంలో ఆర్డీటీ స్పోర్ట్స్ డైరెక్టర్ సాయికృష్ణ, ఉరవకొండ కృష్ణవేణి, బత్తలపల్లి ప్రమీలా, బుక్కరాయసముద్రం లక్ష్మణరావు, ఆర్డీటీ గ్రాస్‌రూట్ కోఆర్డినేటర్ వంశీకృష్ణ, భారత్ పారా అథ్లెటిక్ జట్టు కోచ్ సురేష్‌కుమార్, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



ఓవరాల్ చాంపియన్ ట్రోఫీతో ఉరవకొండ రీజియన్ బాలికల అథ్లెటిక్స్ జట్టు

వదాన్య బ్రోచర్‌ను ఆవిష్కరించిన మంత్రి లోకేశ్

అనంతపురం, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు వదాన్య సొసైటీ ప్రతి ఏటా నిర్వహించే ప్రతిభా పరీక్షలకు సంబంధించిన బ్రోచర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఈ బ్రోచర్‌ను విడుదల చేశారు. వదాన్య సొసైటీ వ్యవస్థాపకుడు అశోక్ వడపాటి సంస్థ ప్రతినిధులతో కలిసి నారా లోకేశ్‌ను మంగళగిరిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా సొసైటీ చేస్తున్న సేవలను మంత్రి లోకేశ్‌కు వివరించారు. 13 ఏళ్లగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సొసైటీ పనిచేస్తున్నట్లు తెలిపారు. నిరుపేద, నిరాశ్రయ ప్రతిభావంతులైన విద్యార్థుల అభ్యున్నతి కోసం సేవలందించడంతో పాటు ప్రతి ఏడాది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు టాలెంట్ టెస్టును నిర్వహిస్తున్నట్లు మంత్రికి వివరించారు. ఏటా దాదాపు 4500 మంది విద్యార్థులు ప్రతిభా పరీక్షలకు హాజరవుతారని, ఆ పరీక్షల్లో ప్రతిభ కనబరచడంతో పాటు సంస్థ ఎంపిక చేసిన విద్యార్థులకు ప్రోత్సాహకాలతో పాటు ఉన్నత చదువుల కోసం ఆర్థిక చేయూతను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాది డిసెంబరులో ప్రతిభా పరీక్షను నిర్వహిస్తున్నట్లు మంత్రికి వివరించారు. ఈ ప్రతిభా పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేసే కార్యక్రమానికి హాజరుకావాలని మంత్రి నారా లోకేశ్‌ను ఆహ్వానించారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు సంస్థ వ్యవస్థాపకుడు అశోక్ తెలిపారు. ఈ ఏడాది ప్రతిభా పరీక్షతో పాటు ఉమ్మడి అనంతపురం జిల్లాలో మెగా డీఎస్సీ, ఎస్‌జీటీ గ్రాండ్ టెస్టును నిర్వహిస్తున్నట్లు అశోక్ తెలిపారు.



వదాన్య ప్రతిభా పరీక్ష బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి లోకేశ్, అశోక్

జేఎన్‌టీయూలో స్పాట్ అడ్మిషన్లు

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 4: జేఎన్‌టీయూలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల ప్రవేశాలకు స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ చేపట్టినట్లు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కిరణ్మయి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఐసెట్-2024లో అర్హత సాధించడంతోపాటు డిగ్రీలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. ఇప్పటివరకు ఎక్కడా అడ్మిషన్ తీసుకుని ఉండకూడదన్నారు. 7న జేఎన్‌టీయూ పరిపాలనా భవనంలో నిర్వహించే స్పాట్ అడ్మిషన్‌కు ఆసక్తిగల విద్యార్థులు వారి ఒరిజనల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు. స్పాట్ అడ్మిషన్ పొందినవారికి ఫీజురీయింబర్స్‌మెంట్ రాదని అడ్మిషన్ పొందినప్పుడే కోర్సుఫీజు చెల్లించాలన్నారు. ఫీజు, అప్లికేషన్ తదితర వివరాలకు www.jntua.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

ఒట్టిపోతున్న గ్రామాలు

హెచ్ఎల్సీ నుంచి పులివెందుల బ్రాంచ్ కెనాల్ (పీబీసీ)కు నీటి సరఫరాను అధికారులు పూర్తిగా నిలిపివేయడంతో తాడిమర్రి మండలంలోని ఆరు గ్రామాలు తాగు, సాగు నీరు అందక ఒట్టిపోతున్నాయి. నీరు వదిలేందుకు ఉత్తర్వులు ఉన్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. నాడు సత్యసాయి జిల్లాలో అత్యధికంగా చీనీచెట్లు సాగుచేసిన కునుకుంట్ల గ్రామం.. నేడు సాగు నీరు అందక ఒట్టిపోతోంది.


పీబీసీకి నీరు వెళ్లకుండా అడ్డంగా వేసిన మట్టి

తాడిమర్రి, అక్టోబరు 4: హెచ్చెల్సీ నుంచి ఏడాదిలో కనీసం ఆరు నెలల పాటు పులివెందుల బ్రాంచ్ కెనాల్ (పీబీసీ) ద్వారా చిత్రావతికి నీరు వెళ్లేది. దీనికి ఎలాంటి లిఫ్ట్ సిస్టం అవసరం లేకుండానే గ్రావిటీ ద్వారా ఏటా మూడున్నర టీఎంసీల నీరు సీబీఆర్‌కు చేరుకునేది. పీబీసీ కాలువ ఆధునీకరణ కోసం నూతన కాలువకు భూసేకరణ కోసం 2007లో అప్పటి ప్రభుత్వం రూ.200 కోట్ల వరకు ఖర్చు చేసింది. కాలువలో వెళ్తున్న నీరును వాడుకునేందుకు స్థానిక రైతులకు అర్హతలేదని అప్పట్లో అధికారులు మోటార్లు కూడా పగలకొట్టేవారు. అయితే ఇప్పుడు ఏమైందో కానీ.. పీబీసీ కాలువకు నీరు ఇచ్చేందుకు అధికారులు మోహం చాటేస్తున్నారు. ఏడాదికి ఆరు నెలల పాటు పీబీసీ ద్వారా ప్రవహించే నీరు గడిచిన ఐదేళ్లలో అంతా కలిపినా 60 వారాలు కూడా వదలడంలేదు. ఇప్పుడైతే హెచ్ఎల్సీ ద్వారా పీబీసీకి నీరు రాకుండా తుంపర డీప్ కట్ వద్ద షెట్టర్లు వేయడంతో పాటు కంపలు అడ్డుగా వేసి నీరంతా తాడిపత్రి బ్రాంచ్ కెనాల్‌కు వెళ్లేలా అధికారులు చేశారు. అదేవిధంగా మట్టితో కూర్చి నీరు లీకేజీ కాకుండా చేశారు. కాలువకు నీరు వదిలేందుకు ఉత్తర్వులు ఉన్నా.. అధికారులు మాత్రం ఎందుకిలా చేస్తున్నారో అర్థంకావడం లేదని ఆరు గ్రామాల రైతులు వాపోతున్నారు.


కునుకుంట్ల వద్ద ఎండిన పీబీసీ కాలువ


టీబీసీకి వెళ్తున్న నీరు

షట్టర్లను కనీసం అర అడుగు మేరపైకి ఎత్తి పీబీసీకి నీరు వదిలితే నార్పల మండలం ముచ్చు కుంట పల్లి, గంగనపల్లి, గూగూడు తాగునీటి అవస రాలు తీరడంతో పాటు తాడిమర్రి మండలం రామాపురం వద్ద ఎత్తిపోతల పథకం పనిచేస్తుంది. కునుకుంట్ల, చిల్లకొండయ్యపల్లి గ్రామాల రైతులకు తాగు నీరు, సాగునీరు అందుతుంది. ఈ నీరు పీబీసీకు విడుదల చేయకపోవడంతో కునుకుంట్ల గ్రామంలోని చీనీ రైతులు సాగునీటి కోసం అల్లాడిపోతున్నారు. సత్యసాయి జిల్లాలో అత్యధికంగా చీనీచెట్లు సాగు అవుతున్నది కునుకుంట్ల గ్రామం లోనే. అధిక దిగుబడి కూడా ఈ గ్రామ రైతులు సాధిస్తారు. అలాంటి గ్రామానికి ఇప్పుడు సాగు నీటి కష్టాలు వెంటాడుతున్నాయి. వర్షాకాలమే అయినా చీనీ చెట్లకు నీటిని ట్యాంకర్ల ద్వారా అందిస్తూ కాపాడుకొంటున్నారు. ఇలాంటి పరిస్థి తులలో తుంపర డీప్ కట్ వద్ద షెట్టర్లను అర అడుగు మేర పైకి ఎత్తి వారం పాటు నీటిని వదలాలని రైతులు కోరుతున్నారు. దీంతో భూగ ర్భజల మట్టం పెరిగి సాగునీటి కష్టాలు తీరుతాయని ఆకాంక్షిస్తున్నాయి.

కొద్దిగైనా గేట్లు ఎత్తాలి



ఇప్పటికిప్పుడు తాడిపత్రికి నీరు వెళ్లకుండా అడ్డుపడమని మేం కోరడంలేదు. అర అడుగు మేర షట్టర్లు ఎత్తి ఒక వారం మాకు నీరిస్తే కొంత వరకు సాగునీటి కష్టాలు తీరుతాయి. నెల రోజుల తరువాత చిత్రావతి నదికి నీరు ఇచ్చే కార్యక్రమం చేపట్టినా ఇబ్బంది ఉండదు. దీనిపై పరిటాల శ్రీరామ్ దృష్టి సారించాలి.

-శ్రీనివాసరెడ్డి, రైతు, కునుకుంట్ల

మా గురించీ ఆలోచించాలి



అధికారులు ఇక్కడి గ్రామాల్లో నీటి సమస్య గురించి కూడా ఆలోచించాలి. మాకు నీరు వచ్చేలా కాలువకు నీరు వదిలితే లిఫ్ట్ సిస్టం వాడుకలోకి వస్తుంది. దీనికి తోడు గూగూడు చెరువుకు నీరు చేరుతుంది. అంతేకాకుండా మాకు తాగునీటి కష్టాలూ తీరుతాయి. అధికారులు కాస్తా ఆలోచించాలి.

-రామ్మోహన్, రైతు, రామాపురం

ధర్మవరంలోనే లేబర్ ఆఫీస్ ఏర్పాటు చేయాలి

ధర్మవరం, అక్టోబరు 4: పట్టణంలోనే లేబర్ ఆఫీస్‌ను ఏర్పాటు చేయాలని సీఐటీయూ, సీపీఎం నాయకులు ఆర్డీఓ మహేశ్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. గతంలో లేబర్ ఆఫీసు ఇక్కడే ఉండేదని, సత్యసాయి జిల్లా ఏర్పడిన తరువాత ఆ ఆఫీసును కొత్తచెరువుకు తరలించారని అన్నారు. ధర్మవరంలో సుమారు 50 వేల మంది కార్మికులు ఉన్నారని, వారికి అందుబాటులో ఉండేవిధంగా లేబర్ ఆఫీస్‌ను ధర్మవరంలోనే ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ కో-కన్వీనర్లు అయూబ్‌ఖాన్, ఎల్ ఆదినారాయణ, సీపీఎం సీనియర్ నాయకులు ఎస్‌హెచ్‌బాషా, సీపీఎం పట్టణ కార్యదర్శి శేషంపల్లి మారుతి, రవి పాల్గొన్నారు.

కమ్యూనికేషన్ స్కిల్స్‌పై అవగాహన

ధర్మవరం, అక్టోబరు 4 : స్థానిక వివేకానంద డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు కెరియర్ గైడెన్స్, ప్లేస్‌మెంట్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బెంగుళూర్‌కు చెందిన టెక్నో హబ్ సొల్యూషన్స్ కంపెనీ వారి దీన్ని నిర్వహించారు. చదువుతోపాటు ప్రతి విద్యార్థికి కమ్యూనికేషన్ స్కిల్స్ ఉంటే ఏ రంగంలోనైనా ఉన్నతస్థితిలో రాణించగలుగుతారన్నారు. నేటి పోటీ ప్రపంచంలో ప్రతి విద్యార్థి ప్రోగ్రామింగ్‌పైనే దృష్టి పెట్టకుండా క్రిటికల్ థింకింగ్, ప్రాబ్లం సాల్వింగ్‌పై దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ హర్షవర్ధన్, కళాశాల డైరెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి, కరస్పాండెంట్ వాసవి భాస్కర్‌రెడ్డి, ఏఓ రమేశ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

బీసీ కులగణన చేపట్టాలి

కదిరి అర్బన్, అక్టోబరు 4 : బీసీ కులగణన చేపట్టేలా చర్యలు తీసుకోవాలని బీసీ ఉద్యోగులు ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌కు శుక్రవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతా నాగరాజు మాట్లాడుతూ.. జనగణనలో బీసీ సమగ్ర కులాల వారీగా లేకపోవడంతో, వారికి దక్కాల్సిన దామాసా ప్రకారం విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థలు, చట్టసభలు, నామినేటెడ్ పదవులు దక్కడం లేదన్నారు. బీసీ జనాభా ఎంత ఉందో తెలిస్తే ఆ మేరకు వారికి రావాల్సి హక్కులు దక్కుతాయన్నారు. ఎస్సీ, ఎస్టీ మాదిరిగా బీసీలకు రక్షణ చట్టం తేవాలన్నారు. ఆయన వెంట ఆ సంఘం సభ్యులు నారాయణ, భోజనం శ్రీనివాసులు, రామమోహన్, గోపాల్, మునిస్వామి, అనిల్, జయరాజ్, శంకర్‌నారాయణ, రమణ ఉన్నారు.

రిజర్వేషన్ చట్టాన్ని పక్కాగా అమలు చేయాలి

ధర్మవరం, అక్టోబరు 4: చేనేత 11 రకాల రిజర్వేషన్ చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు, చేనేత కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఎన్జీఓ హోంలో శుక్రవారం వారు మాట్లాడుతూ ... 11 రకాల రిజర్వేషన్ చట్టాన్ని ఉల్లంఘించి విచ్చలవిడిగా పవర్‌లూమ్స్‌లో పట్టుచీరలు తయారు చేస్తున్నారని, ఆ చట్టాన్ని కాపాడాల్సిన ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అక్రమార్కులతో చేతులు కలిపి చేనేత కార్మికుల కడుపు కొడుతున్నారన్నారు. ఇప్పటికే పట్టణంలో చేనేత కార్మికులు గిట్టుబాటు ధరలు లేక కుటుంబాన్ని పోషించుకోలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత జిల్లా అధ్యక్షుడు పూల లక్ష్మీనారాయణ, గౌరవ అధ్యక్షుడు వెంకటస్వామి, ఏఐటీయూసీ జిల్లా నాయకులు రమణ, జిల్లా ఉపాధ్యక్షుడు చట్టా రవి, సీపీఐ పట్టణ కార్యదర్శి రవి కుమార్, నాయకులు వెంకటస్వామి, ఆదినారాయణ, హరిదేవ, శ్రీదర్, శ్రీనివాసులు, సురేశ్, బాలరంగయ్య పాల్గొన్నారు.

వ్యవసాయ రంగాన్ని కాపాడాలి

తాడిమర్రి, అక్టోబరు 4: ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయ రంగాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కుళ్లాయప్ప, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు కోరారు. శుక్రవారం తాడిమర్రిలో నిర్వహించిన వ్యవసాయ కార్మికసంఘం సమావేశంలో వారు మాట్లాడారు. గ్రామీణ కూలీలకు ఏడాదికి వంద రోజుల పని కల్పించి వారికి కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలన్నారు. ఈ ఏడాది తీవ్ర అనావృష్టి ఫలితంగా వ్యవసాయ పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయని, ఈ పరిస్థితుల్లో రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని కోరారు. అనంతరం మండలానికి నూతన కమిటీని ఎంపికచేశారు. మండల అధ్యక్షుడిగా దాసు, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మీనారాయణ.. మరో 11 మంది సభ్యులను ఎంపికచేశారు. ఈ కార్యక్రమంలో చేతివృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జింకా చలపతి, నాయకులు రమణ, రవి, నాగభూషణ పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

గాండ్లపెంట, అక్టోబరు 4: స్థానిక ఎంపీడీఓ కార్యాలయం సర్వసభ్య సమావేశాన్ని ఎంపీపీ గంగోజమ్మ అధ్యక్షతన శనివారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటరమణారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు హాజరుకావాలని, సమస్యలపై ఆయా శాఖాధికారులతో చర్చిస్తామని అన్నారు.

10న సర్వసభ్య సమావేశం

నల్లమాడ: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 10న సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ సునీతబాయి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అన్నిశాఖల అధికారులు రికార్డులతో హాజరుకావాలన్నారు.

పెరుగుతున్న కుక్కల దాడులు

కొత్తచెరువు, అక్టోబరు 4: మండలంలో రోజు రోజుకూ కుక్కల దాడులు విపరీతంగా పెరుగుతున్నాయి. పదుల సంఖ్యలో కుక్కలు రోడ్లపై తిరుగుతూ.. పాదచారులపైనా.. వాహనదారులపైనా దాడులకు పాల్పడుతున్నాయి. ప్రతి రోజు ఏదో ఒక చోట వీటి బారిన పడి పలువురు గాయాలపాలవుతున్నారు. దీంతో ఇళ్ల నుంచి పిల్లలు, మహిళలు, వృద్ధులు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. గుంపులుగుంపులుగా రోడ్లపై తిరుగుతూ ద్విచక్రవాహనదారులను వెంటపడి మరీ దాడులు చేస్తున్నాయి. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు ఈ వీధి కుక్కల బెడద నుంచి కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.


కొత్తచెరువు నెహ్రూ కూడలిలో సంచరిస్తున్న వీధికుక్కలు


ధర్మవరం గాంధీనగర్‌లో చౌడేశ్వరీదేవి అలంకరణ

క్రైం న్యూస్..

స్కూటర్‌లోని రూ.1.50 లక్షలు చోరీ


నగదు కవర్ ఎత్తుకెళ్తున్న దుండగుడు

కదిరి, అక్టోబరు 4 : స్కూటర్‌లో ఉంచిన రూ.1.50 లక్ష చోరీ అయిన సంఘటన పట్టణంలో శుక్రవారం చోటుచేసుకుంది. పట్టణంలోని వైఎస్ఆర్ నగర్‌కు చెందిన ఆంజనేయులు ఓ ప్రభుత్వ బ్యాంక్‌లో రూ.1.50 లక్ష డ్రా చేశాడు. స్కూటర్ ముందు ఓ కవర్‌లో పెట్టుకొని ఇంటికి బయలుదేరాడు. వైఎస్ఆర్ నగర్ నాలుగో క్రాస్‌లో స్కూటర్ సైడ్ స్టాండ్ స్ప్రింగ్ పోవడంతో.. అక్కడే తన స్కూటర్‌ను నిలిపి పక్కనే ఉన్న తెలిసిన వ్యక్తితో మాట్లాడటానికి ఆంజనేయులు వెళ్లాడు. ఇదే అదునుగా భావించిన దుండగుడు ఆ డబ్బు కవర్‌ను తీసుకొని పారిపోయాడు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సీఐ నారాయణరెడ్డి తెలిపారు. సీసీ ఫుటేజీలు పరిశీలిస్తున్నట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

నల్లమాడ, అక్టోబరు 4 : మండలంలోని పుల్లగంపల్లి, ముత్యాలచెరువు మధ్యలో ప్రధాన రహదారిలో ఆర్టీసీ బస్సు, కారు శుక్రవారం ఢీకున్న ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడు. బెంగుళూరు నుంచి కారులో సమీర్‌ఖాన్, భార్య ఖదీరాఖాన్, కుమారుడు షారూక్‌ఖాన్, జహీర్‌ఖాన్ కదిరికి బయలుదేరారు. కదిరి ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు బెంగళూరు బయలుదేరింది. ఈ రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గాయపడ్డ సమీర్‌ఖాన్‌ను కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. కారు, బస్సులో ప్రయాణిస్తున్న మిగిలినవారికి ఎలాంటి ప్రమాదమూ లేదు. ఘటనాస్థలాన్ని నల్లమాడ పోలీసులు పరిశీలించారు.

కూలిన ఇల్లు


కూలిన ఇంటి వద్ద బాధితురాలు అంకమ్మ

తాడిమర్రి, అక్టోబరు 4 : మండలంలోని ఏకపాదంపల్లిలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి సాకే అంకమ్మకు చెందిన ఇల్లు శుక్రవారం తెల్లవారుజామున సుమారు మూడు గంటలకు కూలింది. ఉక్క పోతగా ఉండటంతో ఇంటి నుంచి అంకమ్మ బయటకు వచ్చి ఉన్న సమయంలో ఆ ఇల్లు కూలింది. దీంతో పెను ప్రమాదం తప్పినట్లైంది. ఆ ఇంట్లో ఆమె ఒంటరిగా ఉంటోంది. కాగా, ఇల్లు కూలడంతో అందులోని బియ్యం, టీవీ, ఫ్రిజ్, సామగ్రి మొత్తం ధ్వంసమయ్యాయని, రూ. లక్షకు పైగా నష్టం వాటిల్లిందని అంకమ్మ వాపోయింది. స్థానిక సర్పంచ్ నాగవేణి పరిశీలించి ప్రభుత్వం నుంచి కొత్త ఇళ్ల మంజూరు చేయించేందుకు కృషి చేస్తానన్నారు.

పాహిమాం.. పరమేశ్వరీ..!


కొత్తచెరువులో పెద్దమ్మతల్లి

ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్ : దసరా దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని రెండో రోజున శుక్రవారం అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ చేశారు. జిల్లా వ్యాప్తంగా ఆయా ఆలయాల్లో అమ్మవారిని రకరకాల రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. కదిరిలో చౌడేశ్వరీదేవి శ్రీలక్ష్మీదేవిగా, బత్తలపల్లిలో ప్రత్యేక మంటపంలో ఏర్పాటు చేసిన అమ్మవారిని గాయత్రిదేవిగా, తనకల్లులో వాసవీమాతను పసుపు, కుంకుమలతో అలంకరించారు. అలాగే ధర్మవరం గాంధీనగర్‌లోని చౌడేశ్వరిదేవికి మహాలక్ష్మీ అలంకరణ, లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో పద్మావతి అమ్మవారు మీనాక్షి దేవిగా, కొత్తచెరువులో పెద్దమ్మతల్లి గాయత్రి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ధర్మవరం మండలంలోని ఉప్పునేసినపల్లిలో కొల్లా పురమ్మను గాయత్రిదేవిగా అలంకరణ చేశారు.


కదిరిలో చౌడేశ్వరీ దేవి

నారా లోకేశ్‌ను కలిసిన విజయ్‌చౌదరి

ధర్మవరం, అక్టోబరు 4: విద్యా, ఐటీ శాఖల మంత్రి నారాలోకేశ్‌ను విజయవాడ ఉండవల్లిలో నివాసంలో శుక్రవారం కలిసినట్లు మండలంలోని చిన్నూరు బత్తలపల్లి వాసి, తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి చిన్నూర విజయ్‌చౌదరి తెలిపారు. నియోజకవర్గంలోని పలు సమస్యలతో తెలుగు యువత సమస్యలను లోకేశ్‌కు వివరించినట్లు చెప్పారు. వాటిని పరిష్కస్తామని నారా లోకేశ్ హామీ ఇచ్చినట్లు తెలిపారు.



బాధ్యతల స్వీకరణ..

ఎంపీడీఓగా రాబర్ట్ విల్సన్



ఓబుళదేవరచెరువు : మండల ఎంపీడీఓగా రాబర్ట్ విల్సన్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో పనిచేస్తున్న ఎంపీడీఓ వరలక్ష్మి కర్నూలు జిల్లాకు బదిలీ కావడంతో ఆమె స్థానంలో రొద్దం ఎంపీడీఓగా పనిచేస్తున్న రాబర్ట్ విల్సన్ బదిలీపై ఓడీసీకి వచ్చారు. ఈఓఆర్డీగా కేశవరెడ్డి, పరిపాలనాధికారిగా రమణనాయక్, సీనియర్ సహాయకులుగా పద్మనాభరెడ్డి, జూనియర్ సహాయకులుగా శ్రీనివాసరెడ్డి బాధ్యతలు చేపట్టారు.

రూరల్ ఎస్ఐగా లింగన్న



పుట్టపర్తిరూరల్ : రూరల్ ఎస్ఐగా లింగన్న శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన నల్లచెరువు పోలీసుస్టేషన్ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడి ఎస్ఐ కృష్ణమూర్తి బుక్కపట్నంకు బదిలీపై వెళ్లారు.

ఎస్ఐగా దాదాపీర్



నల్లమాడ : మండల ఎస్ఐగా దాదాపీర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ రమేష్‌బాబు బదిలీపై సోమందేపల్లి వెళ్లారు. సత్యసాయి జిల్లా వీఆర్‌లో నుంచి దాదాపీర్ నల్లమాడ పోలీస్‌స్టేషన్‌కు వచ్చారు.

పంచాయతీ కార్యదర్శిగా శ్రీనివాసరెడ్డి

కొత్తచెరువు : మేజర్ పంచాయతీ కార్యదర్శిగా శ్రీనివాసరెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఇన్‌చార్జి సెక్రటరీ సురేంద్రరెడ్డి మైలసముద్రానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో అనంతపురం రూరల్ నుంచి శ్రీనివాసరెడ్డి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

కొనసాగిన పప్పుశనగ రిజిస్ట్రేషన్ ప్రక్రియ

అనంతపురం అర్బన్: సబ్సిడీ పప్పుశనగ విత్తనాల కోసం రైతు సేవాకేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ శుక్రవారం రెండోరోజు కొనసాగింది. ఇప్పటిదాకా 3,363 మంది రైతులు 4,949 క్వింటాళ్ల పప్పుశనగ కోసం పేర్లను నమోదు చేసుకున్నారు.

సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలి

కదిరి అర్బన్, అక్టోబరు 4: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలు వెంటనే అమలు చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. కూటమి ప్రభుత్వ సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలో ఆలస్యం చేస్తోందన్నారు. తేదీలు ప్రకటించి కాలయాపన చేయడంతో తప్ప అమలు చేయలేదన్నారు. ఉచిత ఇసుక విధానంలో రోజుకొక ప్రకటనతో కాలం గడుపుతోందన్నారు. భవన నిర్మాణ కార్మికులు, గృహనిర్మాణ లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం వీటిపై దృష్టిసారించి పథకాలు అమలు అయ్యేలా చూడాలన్నారు. తహసీల్దార్ మురళీక్రిష్ణకు వినతపత్రం అందచేశారు. కార్యక్రమంలో బడా సుబ్బిరెడ్డి, జీఎల్ నరసింహులు, జగన్మోహన్, బాబ్‌జాన్, రామమోహన్, ముస్తాక్, తాజుద్దీన్, తిరుపాల్ పాల్గొన్నారు.

ముదిగుబ్బ: సూపర్‌సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి సీపీఎం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సీఐటీయూ మండల కార్యదర్శి బండల వెంకటేష్, బాబ్జాన్, పోతలయ్య, బాషా పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువు: రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ఇసుక వాగ్దానం అమలు చేయాలని కోరుతూ శుక్రవారం ఆర్ఐ మున్వర్‌బాషాకు సీఐటీయూ, సీపీఎం నాయకులు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా నాయకులు శ్రీరాములు, కుళ్లాయప్ప మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో ఒక ఇసుక రీచ్ పాయింట్ ఏర్పాటు చేయాలన్నారు. 2014-19 మధ్య ఉన్న ధరనే అమలు చేయాలన్నారు. లేబర్ కోడ్ అమలుతో పాటు సంక్షేమ బోర్డు అమలు చేయాలన్నారు. మరణించిన భవన కార్మికులకు బీమా అమలు చేయాలన్నారు. అర్హులైన వారికి పక్కాగృహాలు మంజూరు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గంగాద్రి, రాము పాల్గొన్నారు.

తనకల్లు : మండలంలో భవన నిర్మాణ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఓ వేమ నారాయణకు శుక్రవారం వినతిపత్రం అంద చేశారు. మండల వ్యాప్తంగా మూడు వేల మంది భవన నిర్మాణ కార్మికులున్నారని, ఇసుక లేకపో వడంతో ఇతర ప్రాంతాలకు వలసలు పోతున్నారని, వెంటనే ఇసుక ఉచితంగా సరఫరా చేసి, కార్మి కులను ఆదుకోవాలని కోరారు. కార్మికుల వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. తద్వారా సంక్షేపథకాలు అమలు చేయాలని కోరారు. ఉచిత ఇసుక హామీ అమలు చేయాలన్నారు. భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న సంక్షేమపథకాలను వెంటనే అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం శివన్న, సీఐటీయూ వేమన్న, రైతుసంఘం వెంకటరమణ, రామచంద్ర, శ్రీనివాసులు, ఆంజనేయులు పాల్గొన్నారు.

పీసీబీతో ఉద్యోగ అవకాశాలు

అనంతపురం సెంట్రల్, అక్టోబరు 4: ఎలక్ట్రానిక్స్ పరికరాల్లో వినియోగించే ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డు(పీసీపీ) డిజైన్ నేర్చుకున్న విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు విరివిగా లభిస్తాయని హైదరాబాద్‌కు చెందిన డేటాపాయింట్ సొల్యూషన్స్ సంస్థ ప్రతినిధులు హేమంత్, లలిత్ పేర్కొన్నారు. శుక్రవారం అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో పీసీబీ డిజైన్‌పై విద్యార్థులకు వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రిన్సిపాల్ రామమూర్తి, ఈసీఈ విభాగాధిపతి అజయ్, అధ్యాపకులు స్వాతి, అరుణకుమారి, కృష్ణ, నవీన్ పాల్గొన్నారు.

విస్తారంగా వర్షాలు

కుంటలు, చెరువులకు చేరుతున్న నీరు.. పంటలకు జీవం





రొళ్ల మండలంలో పారుతున్న వజ్రహట్టి వంక, పావగడలో కురుస్తున్న భారీ వర్షం, మడకశిర మండలంలో కళకళలాడుతున్న వేరుశనగ పంట

మడకశిర/మడకశిర టౌన్/పావగడ, అక్టోబరు 4: నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో గురువారం ఓ మోస్తారు భారీ వర్షాలు కురవడంతో కుంటలు, చెక్‌డ్యాంలకు నీరు చేరాయి. దీంతో రైతన్నలు హర్షం వ్యక్తంచేస్తున్నారు. గత నెలన్నర రోజులుగా వర్షాభావం కారణంగా ఇబ్బందులు పడుతున్న రైతన్నలకు ఈ వర్షం ఎంతగానో ఊరటనిచ్చింది. కంది పంటకు ఉపయోగపడుతుందని, వేరుశనగ తొలిగించేందుకు కూడా అనుకూలంగా ఉందని రైతులు పేర్కొంటున్నారు. వర్షాభావం కారణంగా వేరుశనగ సాగుచేసిన రైతులకు ప్రత్యామ్నాయ పంటలైన ఉలవలు తదితర పంటల సాగుకు అనుకూలంగా ఉందని వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. అలస్యంగా వేసిన వేరుశనగ, అలసంద, ఉలవలు, కంది, తదితర పంటలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. మడకశిర మండలంలో 26.8 మి.మీ., అమరాపురం 5.2, గుడిబండ 28.0, రొళ్ల 42.4, అగళిలో 19.2 మి.మీ. వర్షపాతం నమోదయింది. అదే విధంగా కర్ణాటక రాష్ట్రంలోని పావగడ తాలూకా వ్యాప్తంగా శుక్రవారం మధ్యాహ్నం నుంచి భారీ వర్షం నమోదయింది. గడిచిన నాలుగు రోజుల నుంచి అత్యధికంగా నిడిగల్లు హోబళిలో 64 మి.మీ., తిరుమణిలో 28, కసబాలో 24, వై.ఎన్. హొసకోటలో అత్యల్పంగా 12 మిల్లీ మీటర్ల వర్షం నమోదయింది. దీంతో పంటలకు ప్రాణం వచ్చిందని రైతులు తెలిపారు. రానున్న ఐదు రోజుల పాటు తుమకూరు జిల్లాలోని పావగడలో అత్యధికంగా వర్షపాతం నమోదు కానున్నట్లు భారత వాతావరణ శాఖ బెంగళూరు వ్యవసాయ విజ్ఞాన కేంద్రం నుంచి సమాచారం వెలువడినట్లు జిల్లా కలెక్టర్ శుభకల్యాణి తెలిపారు. విపత్తు సమయంలో తాలూకా అధికారులు సంఘటన స్థలంలో ఉండి ప్రజలు, పశువులకు ఎలాంటి హానీ కలగకుండా చర్యలు చేపట్టి అవగాహన కల్పించాలని ఆమె తెలియజేశారు.

మద్యంషాపులకు 6 దరఖాస్తులు

పెనుకొండ టౌన్, అక్టోబరు 4 : పెనుకొండ ప్రొహిబిషన్ ఎక్సైజ్ పరిధిలోని 13 మద్యం షాపులకుగాను ఆరు దరఖాస్తులు వేశారని సీఐ సృజన్‌బాబు తెలిపారు. సోమందేపల్లి 3, పెనుకొండ 5, గోరంట్ల 4, రొద్దం 1 మద్యం షాపులున్నాయన్నారు. శుక్రవారం రొద్దం 1, పెనుకొండ 5 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

ద్విచక్రవాహనానికి నిప్పు



కాలిపోయిన ద్విచక్రవాహనం

లేపాక్షి, అక్టోబరు 4 : మండలంలోని బిసలమానేపల్లికి చెందిన ఎంపీటీసీ భాగ్యమ్మ భర్త చంద్రప్రసాద్ ద్విచక్రవాహనానికి గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించారు. ద్విచక్రవాహనం పూర్తిగా దగ్ధమైంది. బిసలమానేపల్లి గ్రామంలో ఇటీవల వాహనాలకు నిప్పంటించే సంఘటనలు వరుసగా జరుగుతుండటంతో వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. వాహనాలను బయటనిలిపి ఇళ్లలో నిద్రపోలేకున్నామని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో జరిగిన సంఘటనను పోలీసులు సీరియస్‌గా తీసుకుని ఉంటే ఇలాంటి సంఘటన పునరావృతం అయ్యేవి కావని గ్రామస్థులు అన్నారు. చిలమత్తూరు ఎస్‌ఐ మునీర్‌అహ్మద్ ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన

గోరంట్ల, అక్టోబరు 4: మండలంలోని కమ్మలవాండ్లపల్లి వద్ద విద్యార్థులకు వన్యప్రాణుల సంరక్షణపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా బుక్కపట్నం రేంజ్ అటవీ శాఖ విద్యార్థులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసింది. కార్యక్రమంలో యూనివర్సిటీ డీన్ డాక్టర్ శర్మ, రిజిస్ట్రార్ జై ప్రకాష్, ఎఫ్ఎస్ఎస్ చంద్రనాయక్, ఎఫ్‌బీఓలు రామక్రిష్ణ, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

పత్తికుంటపల్లిలో ఉచిత వైద్యశిబిరం

హిందూపురం(సోమందేపల్లి), అక్టోబరు 4 : మండల పరిధిలోని పత్తికుంటపల్లిలో శుక్రవారం అనంతపురం చంద్ర ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. దగ్గు, ఆయాసం, గుండె సంబంధిత వ్యాధులు, చెవి, ముక్కు సంబంధించిన రోగాలకు ఉచితంగా పరీక్షించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు మోహన్, వన్నూరుబి, ఆసుపత్రి మార్కెటింగ్ ఇన్‌చార్జ్ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన ఎంపీడీఓ

పెనుకొండ, అక్టోబరు 4: హిందూపురం ఎంపీ బీకే పార్థసారథిని పెనుకొండ ఎంపీడీఓ నరేష్ కలిశారు. శుక్రవారం ఎంపీడీఓ నరేష్ ఎంపీ బీకే పార్థసారథిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

వృద్ధుడికి గాయాలు

గోరంట్ల, అక్టోబరు 4: పట్టణంలోని హిందూపురం రహదారిలో మార్కెట్‌యార్డు వద్ద ద్విచక్రవాహనాన్ని బొలేరో ఢీ కొన్న సంఘటనలో శుక్రవారం నరసింహులు అనే వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని బూడిదగడ్డపల్లికి చెందిన నరసింహులు ద్విచక్రవాహనంపై గోరంట్లకు వస్తుండగా మార్కెట్ యార్డు వద్ద ఆటోను క్రాస్ చేస్తుండగా బొలేరో వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకురాగా డాక్టర్ ఉష చికిత్సలు అందించారు. మెరుగైన వైద్యం కోసం హిందూపురం తరలించారు.

విద్యార్థులకు శిక్షణ

హిందూపురం(సోమందేపల్లి), అక్టోబరు 4: మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం శిక్షణ తరగతులు ప్రారంభించినట్లు ఒకేషనల్ టీచర్ రవికుమార్ తెలిపారు. ఈ శిక్షణ తరగతులు వారం రోజులు కొనసాగుతాయన్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు, సామర్థ్యాన్ని పెంపొందించేందుకు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నాగేంద్రప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

గుడిబండ : మండలంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వృత్తి విద్య విద్యార్థులకు శుక్రవారం శిక్షణ నిర్వహించారు. విద్యార్థులు భవిష్యత్తులో అవసరమైన ప్రాథమిక నైపుణ్యాలు పొందుతారని ప్రధానోపాధ్యాయుడు గోవిందప్ప తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సుష్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

గుడిబండ, అక్టోబరు 4: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రామారావు తెలిపారు. సమావేశానికి మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు.

జూదరుల అరెస్ట్

గుడిబండ, అక్టోబరు 4 : మండలంలోని దాసరపల్లి శివారులో పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి నగదు స్వాధీనం చేసుకున్నట్లు సీఐ రాజ్‌కుమార్ తెలిపారు. పేకాట ఆడుతున్నవారిపై ఏఎస్‌ఐ రాజ్‌కుమార్, సిబ్బందితో శుక్రవారం దాడిచేసి నలుగురిని అరెస్టు చేసి వారి నుంచి రూ.27,080 నగదు, మూడు ద్విచక్రవాహనాలు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

కరుణించు మాతల్లి కనకదుర్గమ్మా..






కామాక్షిదేవిగా ముద్దిరెడ్డిపల్లి చౌడేశ్వరీమాత, మూకాంబికాదేవిగా వాసవీమాత, మడకశిర ఒడిసిలమ్మకు గాయత్రిదేవి అలంకరణ, పెనుకొండలో గాయత్రిదేవి అలంకరణలో వాసవీమాత

(ఆంధ్రజ్యోతి, న్యూస్ నెట్‌వర్క్)

దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా రెండో శుక్రవారం అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక సందడి నెలకొంది. ఉదయం నుంచే ఆలయాలకు భక్తులు పోటెత్తారు. హిందూపురం పట్టణ పరిధిలోని త్యాగరాజనగర్‌లో ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవారు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. సింహవాహనంపై శంకుచక్ర గద, శూలం, గొడ్డలితో మహిషాశురమర్ధిని అమ్మవారు కన్నుల పండువగా నిలిచారు. ముద్దిరెడ్డిపల్లిలోని చౌడేశ్వరీ దేవి కామాక్షిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్య వైశ్యుల ఆరాధ్యదైవం వాసవీమాత మూకాంబికాదేవిగా కొలువుదీరారు. మడకశిర పట్టణంలోని వివిధ దేవాలయాల్లో అమ్మవార్లు కొలువుదీరారు. కన్యకాపరమేశ్వరీ అమ్మవారు గాయత్రిదేవి అలంకరణలో కొలువుదీరారు. అమరాపురం బస్టాండు ఆవరణలో ఉన్న ఒడిసిలమ్మ అమ్మవారు, గాయత్రి మాత అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఊరి మారమ్మ, కొల్లాపురమ్మ, గంగాపూజమ్మ దేవాలయాల్లో విశేష అలంకరణలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో తెప్పోత్సవాన్ని నిర్వహించారు. గోరంట్లలో వాసవి మాతకు గాయత్రి దేవి అలంకరణ, చౌడేశ్వరీ ఆలయంలో అమ్మవారికి మహాలక్ష్మీ అలంకరణ చేశారు. గుమ్మయ్యగారిపల్లి మారెమ్మ ఆలయంలో అమ్మవారికి గాయత్రి దేవిగా అలంకరించారు. సోమందేపల్లి చౌడేశ్వరీ ఆలయంలో విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని అభిషేకాలు, దీపారాధన నిర్వహించారు. ధర్మకర్త ఈశ్వరయ్య ఆధ్వర్యంలో భక్తులకు వసతులు కల్పించారు. కార్యక్రమంలో తొగటవీరక్షత్రియ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. పెనుకొండ లక్ష్మీ వెంకటరమణస్వామి ఆలయంలో స్వామివారిని తమలపాకుల అలంకరణలో, వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో అమ్మవారిని గాయత్రి మాత రూపంలో అలంకరించారు. పరిగి గ్రామంలో వెలసిన సప్తమాతృక ఆలయంలో నవరాత్రిలో భాగంగా గాయత్రిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పెనుకొండ మండలం చంద్రగిరి గ్రామంలో శ్రీగిరి మహేశ్వరి శక్తిపీఠంలో అమ్మవారు గాయత్రి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఉచిత ఇసుకను అందుబాటులోకి తీసుకురావాలి



గోరంట్లలో తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న కార్మిక సంఘం నాయకులు

చిలమత్తూరు/గోరంట్ల/సోమందేపల్లి, అక్టోబరు 4: ప్రభుత్వం అమలుచేస్తున్న ఉచిత ఇసుక విధానం ద్వారా ప్రతి ఒక్కరికి ఇసుకను అందుబాటులోకి తీసుకురావాలని కోరుతూ సీపీఎం నాయకులు శుక్రవారం చిలమత్తూరు తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు ప్రవీణ్‌కుమార్, వెంకటేష్, రామచంద్ర, సుధాకర్, మంజునాథ్, నరసింహ, అశ్వర్థరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అందరికీ ఉచిత ఇసుక లభించేలా చర్యలు తీసుకోవాలని, భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి చూపాలని, నిర్మాణాలు చేపట్టే వారిపై అధిక భారం లేకుండా చూడాలని కోరారు. జూనియర్ అసిస్టెంట్ శంకర్‌కి వినతి పత్రం అందజేశారు. గోరంట్లలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద భవననిర్మాణ, వ్యవసాయ కార్మికులు ధర్నా చేశారు. కార్యక్రమంలో భవననిర్మాణ కార్మికుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ మాట్లాడుతూ ఉచిత ఇసుక అమలుకాకపోవడంతో పేదల సొంతింటి కల నెరవేరలేదన్నారు. అనంతరం తహసీల్దార్ మారుతికి వినతిపత్రం అందచేశారు. కార్యక్రమంలో నాయకులు అంజనేయులు, స్వర్ణలత, వెంకటేష్, కిరణ్, ప్రసాద్, సురేష్, మధు, వెంకటరమణ, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు. సోమందేపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట భవన నిర్మాణ సంఘం నాయకులు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు రవి, హనుమయ్య, వెంకటేశులు, రంగ, నారాయణస్వామి, బాబు, నరసింహులు, రమేష్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

దివాకర్‌రెడ్డిని కలిసిన గుండుమల



దివాకర్‌రెడ్డితో మాట్లాడుతున్న గుండుమల తిప్పేస్వామి

మడకశిరటౌన్, అక్టోబరు 4 : మాజీ మంత్రి జేసీ దివాకర్‌రెడ్డిని తాడిపత్రిలోని ఆయన స్వగృహంలో శుక్రవారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకొన్నారు. జిల్లాలో తాజా రాజకీయాలపై చర్చించినట్లు ఆ పార్టీ నాయకులు తెలిపారు. అనంతరం అనంతపురం బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో డీజీఎం బాలగంగాధర్‌రెడ్డిని కలిసి నియోజకవర్గంలో దాదాపు 80 గ్రామాల్లో బీఎస్ఎన్ఎల్ సిగ్నల్ సమస్యలు ఉన్నాయని, దీని వల్ల కొన్ని గ్రామాలలో స్టోర్ డీలర్లతోపాటు ఇతర సమస్యలు ఎదురవుతున్నాయని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు లక్ష్మీనారాయణ, మనోహర్, రవి, తదితరులు ఉన్నారు.

సాగుభూములకు పట్టాలివ్వాలి



రైతులతో సమావేశమైన నాయకులు

పావగడ, అక్టోబరు 4: రైతులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు అందించాలని బీపీఎస్ రాష్ట్ర నాయకుడు, ప్రముఖ న్యాయవాది దేవనహళ్లి మహేష్‌దాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం సీకే పురం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు సాగు చేస్తున్న రైతులందరికి చట్టబద్ధం చేసి పట్టాలు అందించాలని లేనిపక్షంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద పెద్దఎత్తున ధర్నా చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు కెంచరాయ, హనుమంతరాయప్ప, ఈరన్న, రైతులు పాల్గొన్నారు.

నష్టాల నుంచి సొసైటీలను గట్టెక్కించండి

అనంతపురం క్లాక్‌టవర్, అక్టోబరు 4: నష్టాల్లో ఉన్న సొసైటీలకు గట్టెక్కించాలని ఏపీ రాష్ట్ర ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పీఏసీఎస్) ఉద్యోగుల సంఘం నాయకులు కోరారు. శుక్రవారం రాజధాని అమరావతిలో ఆప్కాబ్ ఎండీ శ్రీనాథ్‌రెడ్డిని కలిసిన సొసైటీ ఉద్యోగుల సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ.. సొసైటీలకు ఆదాయంలో రావాల్సిన నిధులు, రైతులకు దక్కాల్సిన వడ్డీ రాయితీ రూ.2.80కోట్లు వెంటనే చెల్లించాలని కోరారు. గత ఐదేళ్లుగా సొసైటీలకు కేంద్రప్రభుత్వం చెల్లించే వడ్డీ రైతులకు ఇవ్వకుండా ఏడీసీసీ బ్యాంకులోనే తొక్కిపెట్టారని, విషయం బయటకు రాకుండా అధికారులు యత్నిస్తున్నారని ఫిర్యాదు చేశారు. సొసైటీలలో నిధులు లేక, ఉద్యోగులకు వేతనాలు చెల్లించక మూతపడే దయనీయ స్థితిలో ఉన్నాయని తెలిపారు. 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం జారీ చేసిన సొసైటీ ఉద్యోగుల హెచ్ఆర్ పాలసీని నేటికీ అమలు చేయడం లేదన్నారు. వెంటనే సొసైటీల సమస్యలు పరిష్కరించాలని కోరారు. దీనికి ఎండీ స్పందిస్తూ పరిశీలించి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆంజనేయులు, హరికృష్ణ ఎండీని కలిసిన వారిలో ఉన్నారు.

చౌకధరల డిపోలపై విజిలెన్స్ దాడులు

అనంతపురం న్యూటౌన్, అక్టోబరు 4: జిల్లాలోని పలు ప్రాంతాల్లోని చౌకధరల డిపోలపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. వజ్రకరూరు మండలం చాబాల గ్రామంలో డీలర్ బండారు లక్ష్మికి చెందిన రేషన్ షాపును తనిఖీ చేశారు. రికార్డులు ఉన్న స్టాకును పరిశీలించగా ఉండాల్సిన సరుకు కంటే అదనంగా ఉన్నట్లు తెల్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. తనిఖీల్లో సీఐ శ్రీనివాసులు, ఎస్‌ఐ ఫణీంద్రనాథ్‌రెడ్డి, ఏఓ వాసుప్రకాష్, వీఆర్వో ఈశ్వర్ పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్ట్

రాప్తాడు, అక్టోబరు 4: అంతర్రాష్ట్ర దొంగను అరెస్టు చేసి, 62 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం రాప్తాడులో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ గంగన్న శివరాజు అలియాస్ శివ కర్ణాటక రాష్ట్రం, గౌరిబిదనూరు తాలుకా నగిరిగిరి తాలుకాకు చెందిన వ్యక్తి. లేపాక్షి మండలం పిల్లిగుండ్ల కాలనీలో నివాసం ఉంటున్నాడు. శివరాజు మరో వ్యక్తితో కలిసి ద్విచక్ర వాహనంలో వెళ్లి గ్రామాల్లో ఒంటరిగా ఉన్న మహిళలను, అనారోగ్య వృద్ధులను టార్గెట్ చేసేవాడు. అనారోగ్యంతో బాధపడేవారికి కేరళ నాటు వైద్యం చేస్తామని, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలలో పని చేస్తున్నామని ప్రభుత్వ పథకాలు అందేలా చేస్తామని మాయ మాటలతో వారిని నమ్మించేవాడు. అదను చూసి వారి మెడలోని బంగారు చైన్లు, కమ్మలు కాజేసేవాడు. గత నెల 30న అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లి గ్రామానికి చెందిన శివరామనాయుడు ఇంటికి వెళ్లాడు. శివరామనాయుడు పెరాలసిస్ వ్యాధితో బాధపడుతుండగా ఉచితంగా కేరళ ఆయుర్వేద వైద్యం చేసి నయం చేస్తామని నమ్మించి అతని భార్య రామలక్ష్మి మెడలోని బంగారు చైను, కమ్మలు 52 గ్రాములు కాజేసి ద్విచక్రవాహనంపై పరారీ అయ్యాడు. గతేడాది మడకశిర మండలం అక్కంపల్లికి చెందిన 70 ఏళ్ల వృద్ధురాలు హనుమక్క నుంచి 12 గ్రాముల బంగారం దొంగిలించాడు. ఇటుకలపల్లి పోలీసులు శివరాజును ఉప్పరపల్లి పంచాయతీ పంగల్‌రోడ్డులో పట్టుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇటుకలపల్లి ఎస్‌ఐ విజయ్‌కుమార్, ఏఎస్‌ఐ బాబా, హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్, పైకంబర్ వలి, కానిస్టేబుళ్లు పీసీ అనిల్‌కుమార్, నల్లప్ప పాల్గొన్నారు.

రైతుకు న్యాయం చేయండి

సీఎం కార్యాలయం నుంచి తహసీల్దార్‌కు ఆదేశాలు



రైతుతో వివరాలు తెలుసుకుంటున్న తహసీల్దార్ కరుణాకర్

మడకశిర రూరల్, అక్టోబరు 4: రైతుకు న్యాయం చేయాలంటూ ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి మడకశిర తహసీల్దార్‌కు ఆదేశాలు వచ్చాయి. శుక్రవారం ఆంధ్రజ్యోతిలో 'పాసుపుస్తకం ఇప్పించండి సారూ..' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి ముఖ్యమంత్రి కార్యాలయం స్పందించింది. దీంతో రైతును తహసీల్దార్ కార్యాలయానికి పిలిపించి విచారించారు. తహసీల్దార్ కరుణాకర్ మాట్లాడుతూ సీఎం కార్యాలయం, కలెక్టర్ నుంచి రైతుకు న్యాయం చేయాలని ఆదేశాలు వచ్చాయని తెలిపారు. రైతు భూమికి సంబంధించి రెవెన్యూ రికార్డులు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రైతు భూముల లావాదేవీ వివరాలను సేకరించి, పరిశీలించి రైతు న్యాయం చేస్తామని పేర్కొన్నారు.

భూవివాదంలో వృద్ధుడి ఆత్మహత్య



షేక్ రఫీక్ మృతదేహం

పెనుకొండ టౌన్, అక్టోబర్ 4: భూవివాదంలో మనస్థాపానికి గురైన షేక్ రఫీక్ (67) అనే వృద్ధుడు శుక్రవారం పెనుకొండ మార్కెట్ యార్డులో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. రఫీక్‌కు గోరంట్ల గ్రామంలో 90సెంట్లు భూమి ఉందని, దానిని ఆసియాభాను అనే మహిళ పదేళ్ల క్రితం కొనుగోలు చేసేందుకు రూ.10 లక్షలు ఇచ్చి అగ్రిమెంట్ చేసుకుందన్నారు. అదే భూమిపై కోర్టులో కేసు ఉందన్నారు. ఆసియాభాను పదేపదే రిజిస్ట్రేషన్ చేయించాలని ఒత్తిడి చేసిందని తెలిపారు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం సమీప బంధువు, రిటైర్డ్ ఎస్‌ఐతో కలిసి అగ్రిమెంట్‌కు ఇచ్చిన డబ్బు తిరిగి చెల్లించాలని ఒత్తిడి చేయడంతో కోర్టు కేసు పరిష్కారం చేయలేక, రూ.10లక్షలు చెల్లించలేక మానసిక ఒత్తిడికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు చెప్పారు. మృతుడి కుమారుడు షేక్ రియాఫత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె, భార్య షకీలాభాను ఉన్నారు. వీరు పెనుకొండ పట్టణంలోని కమాన్ వీధిలో నివాసముంటున్నారు. మృతుడు రిటైర్డ్ ఆర్టీసీ మెకానిక్ అని తెలిపారు.

పవన్‌కు మద్దతుగా పూజలు

హిందూపురం (సోమందేపల్లి), అక్టోబరు 4: లడ్డూ వివాదంపై పవన్ చేపట్టిన ప్రాయశ్చిత దీక్షకు మద్దతుగా సోమందేపల్లి మండల కేంద్రంలో జనసేన పార్టీ కార్యకర్తలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దమ్మ ఆలయం, వెంకటేశ్వరుడి ఆలయాల్లో ఉదయం పూజా కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు గంగాధర్, కొల్లప్ప, సుమిత్ర, వరలక్ష్మీ మాట్లాడుతూ దేశ, విదేశాల్లో సైతం స్వామివారికి భక్తులు ఉన్నారని, గత ప్రభుత్వం ధనదాహానికి, కక్కుర్తికి ఆలయ ప్రతిష్ఠ దిగజార్చారని మండిపడ్డారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ మద్దతుగా తాము పలు ఆలయాల్లో పూజలు చేపట్టినట్లు తెలిపారు.

టీడీపీ నాయకుడికి మంత్రి ఆర్థికసాయం

పెనుకొండ రూరల్, అక్టోబరు 4 : రొద్దం మండలం ఆర్.లోచర్ల గ్రామానికి టీడీపీ సీనియర్ నాయకుడు శ్రీరాములు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి బెంగళూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న బీసీ సంక్షేమ, చేనేత జౌళిశాఖ మంత్రి సవిత రూ.80వేలు ఆర్థిక సాయాన్ని నాయకుల ద్వారా బెంగళూరు ఆసుపత్రిలో అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ హనుమంతరాయుడు, మురళి, ముత్యాలు, రామాంజి, రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

కియ స్టేషన్ ఎస్‌ఐగా రాజేష్

పెనుకొండ రూరల్, అక్టోబరు 4 : మండలంలోని కియా ఇండస్ట్రియల్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా రాజేష్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్‌ఐ రంగడు బదిలీలో భాగంగా పరిగి స్టేషన్‌కు వెళ్లారు. ఆయన స్థానంలో పెనుకొండలో పనిచేస్తున్న ఎస్‌ఐ రాజేష్ బాధ్యతలు చేపట్టారు. శాంతిభద్రతలకు రక్షణకు శాయశక్తులా కృషిచేస్తానని ఆయన తెలిపారు.

రొద్దం ఇన్‌చార్జి ఎంపీడీఓగా రాంకుమార్

పెనుకొండ రూరల్, అక్టోబరు 4 : రొద్దం ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా ఏఓ రాంకుమార్ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ నంబులపూలకుంటకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో చిలమత్తూరు ఏఓగా పనిచేస్తున్న రాంకుమార్.. రొద్దం ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. రొద్దం పంచాయతీ కార్యదర్శిగా గోవిందప్ప బాధ్యతలు చేపట్టారు.

మత్తుతో బతుకు చిత్తు: ఎస్‌ఐ

సోమందేపల్లి, అక్టోబరు 4 : మత్తు పదార్థాలను సేవించడం, తీసుకోవడం ద్వారా బతుకులు ఛిద్రమవుతాయని, ప్రజలు వాటికి దూరంగా ఉండాలని ఎస్‌ఐ రమేష్ తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని పోలేపల్లిలో స్థానిక ప్రజలకు మత్తు పదార్థాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రూ.1.08 లక్షలకు గణపతి లడ్డూ వేలం



కొలువుదీరిన మహాగణపతి, లడ్డూ దక్కించుకున్న దేవరాజు

పావగడ, అక్టోబరు 4: విశ్వహిందూ పరిషత్, బజరంగదళ్ ఆధ్వర్యంలో పట్టణంలో ప్రతిష్ఠించిన హిందూ మహాగణపతి వద్ద కొలువుదీరిన లడ్డును శాంతి మెడికల్ షాపు యజమాని గంగినేని దేవరాజు వేలంపాటలో రూ.1.08 లక్షలకు దక్కించుకొన్నారు. పట్టణంలోని మధుగిరి కోట వాకిలిలో ప్రతిష్ఠించిన విశ్వహిందూ మహా గణపతి వద్ద గురువారం రాత్రి జరిగిన వేలంపాటలో మొదటిసారిగా అధిక మొత్తానికి దక్కించుకొన్న వ్యక్తిగా దేవరాజు నిలిచారు. ఆదివారం జరిగే గణపతి నిమజ్జన ఉత్సవాల టపాసుల కోసం ప్రత్యేకంగా రూ. లక్ష విరాళంగా అందజేస్తున్నట్లు ప్రకటించా రు. కార్యక్రమంలో నిర్వాహకులు తరకారి కిష్టప్ప, సిప్లన్‌నాయుడు, కోట్ల సుబ్రహ్మణ్యం, గంగాధర్‌నాయుడు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల ధర్నా

గోరంట్ల, అక్టోబరు 4: పట్టణంలోని పోస్టాఫీస్ ఎదుట డిమాండ్ల సాధన కోసం తపాల ఉద్యోగులు శుక్రవారం ధర్నా నిర్వహించారు గ్రామ్‌సడక్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆయా కార్యాలయాల పరిధిలో ఉద్యోగులు మూడురోజులపాటు విధులు బహిష్కరించి ఉద్యమం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఐజీడీఎస్ యూనియన్ నాయకులు లక్ష్మీరామ్‌నాయక్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫ్రెషర్స్‌డే

గోరంట్ల, అక్టోబరు 4: స్థానిక ఎస్‌పీవీఎం డిగ్రీ కళాశాలలో శుక్రవారం విద్యార్థులు ఫ్రెషర్స్‌డేలో వేడుకలను ఉత్సాహంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో సీఐ శేఖర్, కరస్పాండెంట్ పెద్దరాసు సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్ భక్తవత్సలం, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినుల నృత్యప్రదర్శన